తిరుపతి - చిత్తూరు



తెలుగు జాతీయ దినపత్రిక
వార్త



# రైతు సేవా కేంద్రంలో కర్మక్రియలు!



రైతు సేవా కేంద్రంలో కర్మక్రియలు జరుగుతున్న దృశ్యం

చిట్టమూరు, డిసెంబర్ 4 ప్రభాతవార్త : చిట్టమూరు మండలం యాకసిరి సచివాలయం పరిధిలోని రైతు సేవా కేంద్రంలో బుధవారం అక్కడ ఘనులు తమ బంధువు కర్మక్రియలకు వాడుకున్న తీరు చూస్తే ఔరా అనాల్సిందే. ఏకంగా ఒకరోజంతా ప్రభుత్వ భవనంలో విధులు నిర్వహించాల్సిన మహిళా ఉద్యోగి మరొక ప్రభుత్వ భవనంలో జరిగే తంతును కళ్లారా చూస్తూ మౌనంగా ఉండటం మినహా మరేమీ చేయలేని నిస్సహాయ స్థితి. స్థానికంగా రైతులకు ఎల్లవేళలా సేవలు అందించి సూచనలు, సలహాలు అందించాల్సిన రైతు సేవా కేంద్రం ఉద్యోగి ఉదయం నుంచి పంట నమోదు విషయంలో కార్యాలయంలో ఉన్నారు. కానీ, గ్రామంలో ఓ వ్యక్తి ఇటీవల మరణించడంతో, ఆయన కర్మక్రియలు జరిపించేందుకు కొందరు రైతు సేవా కేంద్రాన్ని ఎంచుకున్నారు. కానీ ఆ ఉద్యోగి ఒప్పుకోకపోవడం, విషయాన్ని మండల స్థాయి అధికారులకు తెలియజేసినప్పటికీ ఆమెపై, పైఅధికారులకు చెబుతావా అంటూ బెదిరింపులకు గురిచేశారు. ఏకంగా రైతు సేవా కేంద్రం తాళాలు పగులగొట్టి సాయంత్రం వరకు కర్మక్రియల కార్యక్రమాలు జరిపించి కార్యాలయ ప్రాంతాన్ని అపరిశుభ్రం చేశారు. సచివాలయం పక్కనే ఉన్న రైతు సేవా కేంద్రంలో ఇలా కొందరు దౌర్జన్యంగా కర్మక్రియలు జరిపి సిబ్బంది విధులకు ఆటంకం కలిగించినా మండల స్థాయి అధికారులు గాని, స్థానిక నాయకులు సైతం నోరు మెదపకపోవడం గమనార్హం. రైతులకు సేవలు అందించాల్సిన ఓ మహిళా ఉద్యోగి విధులకు ఆటంకం కలిగించడంతో పాటు రైతు సేవా కేంద్రంలో ఏకంగా కర్మక్రియలు నిర్వహించిన వారిపై అధికారులు చర్యలు తీసుకుంటారో లేదో వేచిచూడాలి.

# రేపటి నుండి రెవెన్యూ సదస్సులు

**-తహసీల్దార్‌లు మనసుపెట్టి విధులు నిర్వహించండి**
**-జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్**



తహసీల్దార్‌లతో విడియో సమావేశం నిర్వహిస్తు జిల్లా కలెక్టర్

చిత్తూరు,డిసెంబర్ 4 ప్రభాతవార్త: జిల్లాలో రెవెన్యూ సమస్యలను పరిష్కరించటానికి శుక్రవారం(ఈ నెల 6) నుండి 2025 జనవరి 8 వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తునట్లు ఈ సదస్సులను తహసీల్దార్‌లు మనసుపెట్టి నిర్వహించి విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్,జాయింట్ కలెక్టర్ విద్యాదరితో కలసి ఆర్‌డిఓలు, తహసీల్దార్ లతో రెవెన్యూ సదస్సులపై సమీక్ష నిర్వహించారు.ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులో సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని ఈనెల 6 నుండి జనవరి 8 వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారని తెలిపారు.గ్రామ స్థాయిలో భూములకు సంబందించిన సమస్యలను పరిష్కరించాలనే ఉద్దేశంలో ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తుందన్నారు. ప్రతి గ్రామానికి రెవెన్యూ సదస్సుల సందర్భంగా సంబందిత శాఖల అధికారుల బృందం ప్రతి రెవెన్యూ గ్రామాన్ని సందర్శించి ఫ్రీహోల్డ్,సెక్షన్ 22(ఎ)లకు సంబందించిన భూ ఆక్రమణలపై ఫిర్యాదులను స్వీకరించాలని, అలాగే రెవెన్యూ సదస్సులలో స్వీకరించే ఫిర్యాదులన్నింటిని సంబందిత పోర్టల్‌లో నమోదు చేయాలని నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం రెవెన్యూ గ్రామంలో నిర్దేశించిన ప్రాంతాలలో నిర్వహించాలని సూచించారు. ఇందుకు సంబంధించి గ్రామస్తులకు ముందస్తుగా సమాచారం ఇవ్వలని ఈ సదస్సులకు ప్రజాప్రతినిధులకు, అధికారులకు సమాచారం అందించాలని తెలిపారు.రెవెన్యూ సదస్సులకు జాయింట్ కలెక్టర్ విద్యాదరి సమన్వయకర్తగా ఉంటారని ప్రతి తహసీల్దార్ తమ మండల పరిధిలో రెవెన్యూ సదస్సులు నిర్వహించే స్థలం,తేదీలతో కూడిన షెడ్యూలను ఆమె దృష్టికి తీసుకురావాలని,ముందస్తుగా గ్రామాలలో సదస్సులు నిర్వహించే తేదీలను డండోరా, కరపత్రాల పంపిణీలతో ప్రజలకు తెలియజేయాలని తెలిపారు.ప్రతి పంచాయతీ కార్యాలయం,గ్రామ సంస్థ కార్యాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలం లాంటి ప్రధాన కార్యాలయాలలో రెవెన్యూ సదస్సుల షెడ్యూలు నోటీసులను ప్రదర్శించాలన్నారు. తహసీల్దార్, ఆర్ఐ,విఆర్ఓలు, మండల సర్వేయర్,రిజిష్టేషన్ శాఖ ప్రతినిధులు,అవసరమైన ప్రాంతాలలో అటవీ, దేవాదయ శాఖ, వక్ఫ్‌బోర్డ్ సిబ్బందితో కూడిన అధికార బృందాలు ఆ సదస్సులో పాల్గొంటారన్నారు.రెవెన్యూ సదస్సులలో వచ్చే ప్రతి అర్జీ దారుడికి రసీదులను అందించాలని తహసీల్దార్‌లకు అదేశించారు.ఆర్డీఓలు సదస్సులను పర్యవేక్షిస్తు రెవెన్యూ సదస్సులలో వచ్చే అర్జీలను 45 రోజులలో తహసీల్దార్‌లు చర్యలు తీసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు.జాయింట్ కలెక్టర్ విద్యాదరి మాట్లాడుతూ రెవెన్యూ శాఖ ప్రతిష్ట పెంచేలా తహసీల్దార్‌లు కృషి చేయాలని,సమస్యల పరిష్కారానికి తహసీల్దార్‌లు ప్రత్యేక చొరవ తీసుకుని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మోహన్ కుమార్,చిత్తూరు ఆర్‌డిఓ శ్రీనివాసులు,పలమనేరు ఆర్డీఓ భావని,కుప్పం ఆర్డీ శ్రీనివాసులు,తహసీల్దార్‌లు తదితరులు పాల్గొన్నారు.

# పక్కా ప్రణాళికతో రెవెన్యూ సదస్సుల నిర్వహణ

**-జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్**



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జిల్లా అధికారులు

తిరుపతి కార్పొరేషన్, డిసెంబర్ 4 ప్రభాతవార్త : ఈనెల 6 నుంచి వచ్చే నెల జనవరి 8 వరకు రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్న నేపథ్యం లో జిల్లాలోని అన్ని రెవిన్యూ గ్రామాలలో సదస్సులు చక్కగా నిర్వహించాలని, ప్రజలకు సంబంధించిన అన్ని రెవెన్యూ, భూ సమస్యల పరిష్కారం కొరకు ఈ వేదికను వినియోగించి సత్ఫలితాలు సాధించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఎస్ పేర్కొన్నారు. బుధవారం ఉదయం రెవెన్యూ శాఖ మంత్రి వర్యులు అనగాని సత్యప్రసాద్ సంబంధిత కార్యదర్శి, సిసిఎల్ఎ కమిషనర్ తదితరులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో విజయవాడ నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి రెవెన్యూ సదస్సుల నిర్వహణపై దిశా నిర్దేశం చేయగా తిరుపతి జిల్లా కలెక్టరేట్ నుండి జెసి శుభం బన్సల్‌తో కలిసి జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ ప్రజల యొక్క రెవెన్యూ గ్రీవెన్స్ లను నాణ్యతగా పరిష్కరించి వాటిని జీరో స్థాయికి తీసుకురావడానికి రెవెన్యూ సదస్సులు ఒక వేదికగా వినియోగించుకోవాలని, రెవెన్యూ సంబంధిత సమస్యలతో తమ అర్జీల పరిష్కారం కోసం వచ్చే ప్రజలను పదేపదే ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ తిప్పించుకోవద్దని సూచిస్తూ దిశా నిర్దేశం చేశారు. ప్రభుత్వ మార్గ నిర్దేశాల మేరకు అన్ని చర్యలు తీసుకుంటామని మంత్రికి కలెక్టర్ వివరించారు. మంత్రి విసి అనంతరం అందరు ఆర్డీవోలు, అన్ని మండలాల తహశీల్దార్లు, రెవెన్యూ సిబ్బందితో కలెక్టర్ విసి నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని గ్రామాలలోని రెవెన్యూ సంబంధిత, భూములకు సంబంధించిన సమస్యలను పరిష్కరించే దిశలో పకడ్బందీగా ప్రణాళికా బద్ధంగా రెవెన్యూ సదస్సులను నిర్వహించాలని పేర్కొన్నారు. సంబంధిత శాఖల అధికారుల బృందం ప్రతి రెవెన్యూ గ్రామాన్ని సందర్శించి ఫ్రీహోల్డ్ మరియు సెక్షన్ 22ఎకు సంబంధించిన భూఆక్రమణ సమస్యలతో ప్రభావితమైన వారి నుండి వారికి ముందస్తు సమాచారంతో వినతులను స్వీకరించాలని అన్నారు. పీజీఆర్ఎస్ గ్రీవెన్స్‌లలో సుమారు 55 శాతం రెవెన్యూ సమస్యలు ఉంటున్నాయని వాటి పరిష్కారానికి ఈ రెవెన్యూ సదస్సులు వేదిక చక్కగా ఉపయోగపడుతుందని, జిల్లాలోని 1051 రెవెన్యూ గ్రామాలలో నిర్వహించాల్సి ఉంటుందని, సదరు రెవెన్యూ సదస్సుల నిర్వహణ కార్యక్రమానికి జెసి సమన్వయకర్తగా ఉంటారని, ఆర్డీవోలు తమ పరిధిలోని మండలాలలో రెవెన్యూ సదస్సులను ఫలవంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. రెవెన్యూ సదస్సు నిర్వహించే రోజున వచ్చే అర్జీలకు ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని ఉదాహరణకు సర్వే, అడంగల్, 1బి రికార్డు, కుల ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం, మ్యుటేషన్, పేరు సవరణ తదితర పత్రాలకు ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని, ఆ రోజు మినహా మిగిలిన రోజులలో వచ్చే అర్జీలకు నిర్దేశిత రుసుములు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు, ఎస్డిసి లు దేవేందర్ రెడ్డి వర్చువల్ గా గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, రెవెన్యూ డివిజనల్ అధికారులు రామ్మోహన్ భాను ప్రకాష్ రెడ్డి కిరణ్మయి, కలెక్టరేట్ ఎ.ఓ భారతి, తదితర రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# బిల్లు తీసుకోకముందే "షాక్"!

**భారీగా కరెంట్ బిల్లులు బాదుడు -లబోదిబోమంటున్న జనం**




తిరుపతి,డిసెంబర్ 4ప్రభాతవార్త: కూటమి ప్రభుత్వంలో సామాన్యప్రజలకు మంచి జరుగుతుందని, విద్యుత్, బస్సు ఛార్జీలు పెరగవని నమ్మకంతో ఉన్న వారికి డిసెంబర్ నెల కరెంట్ బిల్లు తీసుకోక ముందే "షాక్" కొట్టేలా బాదుడు మారింది. గత నాలుగునెలలు కరెంట్ బిల్లులతో ఎంతో ఊరట చెందిన విద్యుత్ వినియోగదారులు డిసెంబర్ నెల బిల్లుతో ఒక్కసారిగా గుండెపోటుతో బాటు హైబిపికి గురయ్యేలా కరెంట్ బిల్లులు వచ్చాయి. సామాన్యుడి ఇంట్లో ఒక ట్యూబ్‌లైట్, ఒక ఫ్యాన్,ఫ్రిడ్జ్ వినియోగిస్తున్నా నెలంతా 50యూనిట్లు విద్యుత్ వాడినా డిసెంబర్ కరెంట్ బిల్లు 500 రూపాయలు రావడంతో హడలిపోయే పరిస్థితి కనిపిస్తోంది. తాజాగా గత రెండురోజులుగా విద్యుత్ సిబ్బంది మీటరు రీడింగ్ తీసి కరెంట్ బిల్లులు చేతికి ఇవ్వకముందే బాదుడుతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గత మూడునెలలు 200 రూపాయలు నుండి 300రూపాయలు లోపే వచ్చిన కరెంట్ బిల్లు ఈ నెలమాత్రం 500రూపాయలు పైగానే బిల్లులు రావడంతో కన్నీరుకార్చుతున్నారు. గత ఐదేళ్లలో పలురకాలుగా జనం నెత్తిన కరెంట్‌ఛార్జీలు బాదుడు మోపిన వైసిపి ప్రభుత్వంలో సామాన్య ప్రజలు తినడానికి తిండిలేని దుస్థితి కూడా చవిచూశారు. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం వచ్చిన నాలుగునెలల తరువాత డిసంబర్ కరెంట్ బిల్లు మాత్రం గుండెపోటు తెప్పించేలా ఉంది. ఇప్పటికైనా సామాన్యుడిపై కరెంట్ భారం మోపకుండా మద్యం ధరలు పెంచి ఆదాయం తెచ్చుకోవాలని ప్రజలు దండం పెడుతున్నారు.

## 5 కోట్లుతో ఉపాధి హామీ పనులు : డ్వామా పీడీ




సమావేశంలో ప్రసంగిస్తున్న డ్వామా పీడీ

ఐరాల, డిసెంబర్ 4 ప్రభాతవార్త: మండలంలో జాతీయ ఉపాధి హామీ పథకం ద్వార్వా వివిధ ప్రభుత్వ శాఖలకు సంభందించి 5 కోట్లు రూపాయలతో పనులను నిర్వహించినట్లు డ్వామా పీడీ రవికుమార్ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో 17వ విడత సామాజిక తనికీ బహిరంగ సమావేశం ఎంపీడీఓ ధనలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో డ్వామా పీడీ రవికుమార్ మాట్లాడుతూ ఏప్రిల్ 2023 నుండి ఈఏడాది మార్చి వరకు మండలంలోని 28 గ్రామ పంచాయతీల్లో 2,242 పనులను జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా పనులను నిర్వహించడం జరిగిందన్నారు. ఈపనులకు సంభందించి గత నెల20 నుండి ఈనెల3 వరకు క్షేత్రస్థాయి పరిశీలన జరిగిందన్నారు. 28 గ్రామ పంచాయతీల్లో క్షేత్రస్థాయి సిబ్బంది నుండి 43 వేల రూపాయలను అపరాధ రుసుముగా వసూలు చేసినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ఎంపీడీఓ జి.ధనలక్ష్మి, డివిఓ శివయ్య, ఎస్‌సీ ఎం లోకేష్, డీఈ ప్రసాద , ఏపీఓ సంధ్యారాణి, ఉపాధి హామీ సిబ్బంది, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, గ్రామ కార్యదర్శులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# పిఎస్ఎల్‌వి-సి59 ప్రయోగం వాయిదా

**నిరాశతో వెను తిరగిన దూరప్రాంతాల నుండి వచ్చిన సందర్శకులు**

**యూపియన్ శాటిలైట్ ప్రోబా-3లో సాంకేతిక లోపంతో, 43 నిమిషాల ముందు కౌంట్‌డౌన్‌ను నిలిపివేసిన శాస్త్రవేత్తలు, - నేడు సాయంత్రం 4.04గంటలకు మళ్ళీ ప్రయోగిస్తాం : ఇస్రో**



ప్రయోగవేదికపై భద్రంగా పిఎస్ఎల్‌వి-సి59



సందర్శకుల గ్యాలరీలో ఎదురు చూస్తున్న విద్యార్థులు

శ్రీహరికోట (తడ), డిసెంబర్ 4 ప్రభాతవార్త : శ్రీహరికోటలోని సతీష్‌థవన్ అంతరిక్ష కేంద్రం నుంచి బుధవారం సాయంత్రం జరగాల్సిన పిఎస్ఎల్‌వి- సి59 రాకెట్ ప్రయోగం వాయిదా పడడింది. శాటిలైట్‌లో సాంకేతి లోపం తలెత్తడంతో, ప్రయోగానికి 43 నిమిషాల ముందు కౌంట్‌డౌన్ నిలిపివేశారు. దీంతో దూర ప్రాంతాల నుంచి వచ్చిన వేలాది మంది సందర్శకులు నిరాశ చెందారు. రాకెట్ ప్రయోగానికి ముందు వాయిదా అనే ప్రకటనతో ముఖ్యంగా పిల్లలు తీవ్ర నిరాశ వ్యక్తం చేశారు. వర్షం కురుస్తున్నప్పటికీ రాకెట్ ప్రయోగాన్ని చూడాలన్న ఉత్సాహంతో ఎన్నో వాహనాల ద్వారా సందర్శ కులు ఇక్కడికి తరలివచ్చారు. వీక్షకుల గ్యాలరీ సైతం సగానికిపైగా నిండిపోయింది. పిఎస్ఎల్‌వి-సి59 ప్రయోగం ద్వారా యూరోపియన్ ఉపగ్రహాల ప్రయోగం కావడంతో దీన్ని ఒక ప్రత్యేక ఆసక్తితో తిలకించడానికి తరలివచ్చిన వారు ఉసూరుమంటూ తిరిగి వెనక్కిమళ్లక తప్పలేదు. కొంతమంది షార్ ప్రధాన ద్వారం ముందు రాకెట్ నమూనాల వద్ద ఫొటోలు తీసుకొని సంతోషించారు. మధ్యాహ్నం ప్రయోగం కావడంతో రాకెట్ అంతరిక్షంలోకి వెళ్లే దృశ్యాలు స్పష్టంగా చూడవచ్చని ఆశించిన తమకు నిరాశ తప్పలేదని కొందరు వాపోయారు. ఇదిలావుంటే షార్‌లోని మిషన్ కంట్రోల్ సెంటర్, మీడియా సెంటర్ తదితర చోట్ల కూడా రాకెట్ ప్రయోగం వాయిదాపై కొంత సందిగ్ధం నెలకొని అనంతరం ఇస్రో ప్రకటనతో మళ్లీ రేపటికి అంటూ వెనుతిరిగారు. అటు ఈశా శాస్త్రవేత్తలు, ఇటు ఇస్రో పెద్దలు ఈ ప్రయోగాన్ని మళ్లీ నిర్వహించడానికి సన్నద్ధమయ్యారు. కౌంట్‌డౌన్ నిలిచిన సమయం నుంచి మళ్లీ కొనసాగించి బుధవారం ప్రకటించిన సమయం 4.08 కాకుండా గురువారం మరో 4నిమిషాల తర్వాత 4.04 గంటలకు ఈ ప్రయోగాన్ని జరుపుతున్నట్లు ఇస్రో అధికారికంగా తన ఎక్స్ ఖాతాలో ప్రకటించింది.

# వర్షాలతో ఆలయం జలమయం...ఇబ్బంది పడుతున్న భక్తులు



ఆలయంలో స్థంభాలపై కారుతున్న వర్షపు నీరు

శ్రీకాళహస్తి,డిసెంబర్ 4 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయం పురాతనమైన ఆలయం. ఆలయం ఏ కాలంలో నిర్మించారో ఏమో తెలియదు కానీ 1905లో చెన్నైకు చెందిన నాటు కోటు చెట్టియార్లు జీర్ణోద్ధారణ గావించారు.గత 15 సంవత్సరాల నుంచి ఆలయం ఉరుస్తుంది. చిన్నపాటి వర్షానికి కూడా ఉపరితలం నుంచి నీరు లీకేజీలు అవుతుంది. ఈ లీకేజీలను అరెస్టు చేయటానికి దేవస్థానం రెండు సార్లు నిష్ణాతులకు పనులు అప్పగించారు.ఏడాది క్రితం శ్రీకాళహస్తీశ్వరుని దర్శనానికి వచ్చిన పూనేలో స్థిర పడ్డ తెలుగుబిడ్డ వెంకటేశ్వరరావు 'వెంకీ గ్రూప్ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్‌ను ఏర్పాటు చేసి' చారిత్రక,పురాణ ప్రసిద్ధి చెందిన ఆలయాలకు కొత్త సింగారాలను కల్పిస్తున్నారు. తమిళనాడులోని రెండు ఆలయాల ఉపరితలం లో లీకేజీలను సమర్థవంతంగా అరెస్టు చేసిన ఆయన ఏడాది క్రితం పంచాభూత లింగాల్లో వాయులింగేశ్వరుడు స్వయం భువుగా వెలసిన శ్రీకాళహస్తీశ్వరాల యానికి వచ్చారు. అప్పటి ధర్మకర్తల మండలి చైర్మెన్ ఆలయం వర్షాకాలంలో ఉరుపులకు సంబంధించి మొరబెట్టుకున్నారు.

**రూ.కోట్ల పనులను ఉచితంగా :**

ప్రస్తుతం పూనేకు చెందిన వెంకటేశ్వరరావు ఇచ్చిన మాట ప్రకారం తన సిబ్బందితో మరమ్మతు పనులు చేపట్టారు. ఈ కన్‌స్ట్రక్షన్స్ నిర్వాహకులు పురాతన పద్దతులతో ఇటుకలు, సున్నం,మూలికలతో కలిపిన మిశ్రమంతో కాంక్రీట్ చేసిన తరువాత టైల్స్‌ను అతికిస్తారు. వర్షాలకు ముందే పనులు పూర్తి చేయుటకు ప్రయత్నించారు, కానీ కాంక్రీట్ పనులు 70శాతం అయ్యింది. వర్షాలతో పనులకు ఆటంకంతో, టైల్స్ ఏర్పాటు చేయాల్సి ఉందని సమాచారం. శ్రీకాళహస్తీశ్వరాలయం ఉపరితలంలో పనులు నిర్వహించు టకు దేవాదాయశాఖ అయితే కనీసం పదికోట్లరూపాయలతో అంచనాలు కడతారు. అయితే ప్రస్తుతం పని చేస్తున్న కంపెనీ అంచనాలు రూ.5కోట్లుతో నిర్వహిస్తున్నారు. కంపెని యజమాని వెంకటేశ్వరరావే స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. అంతేకాక ఐఐటి ప్రొఫేసర్లు తరచూ పరిశీలిస్తున్నారు. యుద్ధ ప్రాతిపదికపై పనులు జరుగుతున్నాయి.

**ఇఇ వివరణ:**

శ్రీకాళహస్తీశ్వరాలయం ఉపరితల భాగంలో జరుగుతున్న లీకేజిల అరెస్టు పనులకు సంబంధించి జాప్యం, ఆలయం లీకేజీలకు సంబంధించి ప్రభాతవార్త ఆలయ ఇఇ మురళీధర్‌రెడ్డిని వివరణ కోరగా ఆయన ఇలా తెలిపారు. రూ.కోట్లు విలువ చేసే మరమ్మతు పనులను పూనేకు చెందిన వెంకీ కన్‌స్ట్రక్షన్స్ వారుముందుకు వచ్చి ఉచితంగా నిర్వహిస్తున్నారన్నారు. వర్షాలకు ఆలయంలో ఉరుపులు చోటు చేసుకున్నాయని వివరించారు. అయితే కంపెనీ వారు ఇప్పటి వరకు కాంక్రీట్ మాత్రమే పూర్తి చేసారని అది కూడా 70శాతం మాత్రమే పూర్తి అయినట్లు వివరించారన్నారు. మహాశివరాత్రి లోపల పనులు పూర్తి చేయుటకు పరుగులు తీస్తున్నారని వివరణ ఇచ్చారు.

# సూర్య,చంద్ర వాహనాలపై అలవేలుమంగ



తిరుచానూరు, డిసెంబర్ 4, ప్రభాతవార్త: తిరుచానూరులో అత్యంత వైభవంగ నిర్వహిస్తున్న కార్తీక బ్రహ్మోత్సవాలలో సూర్య,చంద్రుల వాహనా లపై అలివేలు మంగమ్మ భక్తులను అనుగ్రహించారు. బ్రహ్మోత్సవాల్లో ఏడవ రోజైన బుధవారం రాత్రి చంద్రుని వాహనంపై శ్రీ పద్మావతిదేవి దర్బార్ కృష్ణుని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయాన్న సుప్రభాతంతో మేలుకొలిపి సహస్రనామార్చన నిత్య అర్చన నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖ మండ వద్ద స్నపన తిరుమంజనం వేడుకగా చేపట్టారు. తరువాత అమ్మవారి ఉత్సవర్లను వాహన మండపంకు వేంచేపు చేసి సర్వాంగ సుందరంగ అలంక రించి, చంద్రుని వాహనం కొలువుదీర్చారు. దేదీప్యమైన దీపకాంతుల నడుమ అలివేలు మంగమ్మ తిరువీధులలో విహరిస్తూ భక్తులకు అభయమిచ్చారు. బుధవారం ఉదయం సూర్యప్రభ వాహనంపై గోవర్ధన గిరిధారి అలంకారంలో పద్మావతీ దేవి తిరువీధులో విహరిస్తూ భక్తలను అనుగ్రహించింది. ఈ కార్యక్రమంలో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, ఈవో శ్యామల రావు, జేఈవో వీరబ్రహ్మం,ఆలయ డెప్యూటీ ఈవో గోవిందరాజన్,ఏఈఓ దేవరాజులు, ఆలయ అర్చకులు, ఏవియస్ఓ సతీష్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

**పంచమి తీర్థానికి కట్టుదిట్టమైన భద్రత - 1,535 మంది పోలీసులతో పటిష్ట చర్యలు - తిరుపతి జిల్లా యస్.పి. సుబ్బారాయుడు**



పంచమి పుణ్య గడియలు రోజంతా ఉంటుంది. భక్తులు ఎవరు ఆత్రుత పడి అసౌకర్యానికి గురికాకుండా సహనం పాటించాలి అని తిరుపతి యస్.పి సుబ్బారాయుడు భక్తులకు సూచించారు. పంచమి తీర్థానికి వేలాదిగా తరలి వచ్చేభక్తల దృష్ట్యా తిరుపతి యస్.పి పటిష్ఠమైన బద్రత ఏర్పాటు చేసారు .ఈ సందర్బంగా తిరుచానూరులోని ప్రముఖ కళ్యాణమండపంలో పోలీసు అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో యస్.పి మాట్లాడుతూ 1,535 మంది పోలీసులతో పటిష్ట చర్యలు చేపట్టానని తెలిపారు. పుష్కరిణిలో క్రమ పద్ధతిలో విడతల వారీగా భక్తులకు పుణ్య స్నానం ఆచరించే విధంగా పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. తొక్కిసలాటకు తావులేకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. పద్మావతి సరోవరం వద్ద ముందురోజు రాత్రి నుండి పోలీస్ పహారా వుంటాదని అన్నారు. హోల్డింగ్స్ ప్రాంతాల, పుష్కరిణి వద్ద పోలీస్ అధికారులు అప్రమత్తంగా ఉంటూ సమయస్ఫూర్తిగా వ్యవహరించాలని సూచించారు.చిన్న దొంగతనానికి తావులేకుండా క్రైమ్ పోలీస్ లచే పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక వ్యూహం తో పార్కింగ్ ప్రదేశాలలో వాహనాలు పార్క్ చేసుకునే విధంగా ఏర్పాట్లు చేయాలని అధికారులకు తెలియజేశారు. బందోబస్తు విధులను దైవ కార్యంగా భావించి భక్తిశ్రద్ధలతో నిర్వర్తించాలని హితువు పలికారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు, రవిమనోహరాచారి శాంతిభద్రతలు, నాగభూషణరావు నేర విభాగం, ఐ. రామకృష్ణ తిరుమల, డిఎస్పీలు, సిఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు

# కిడ్నాప్ కేసులో...ఆరుగురు నిందితులు అరెస్టు

**కిడ్నాప్‌కు ఉపయోగించిన ఇన్నోవా వాహనం, కత్తి స్వాధీనం**



కిడ్నాప్ విషయమై వివరాలు తెలుపుతున్న తిరుపతి ఈస్ట్ పోలీసు స్టేషన్ ఇన్స్పెక్టర్

తిరుపతి కార్పొరేషన్, డిసెంబర్ 4 ప్రభాతవార్త : కిడ్నాప్ కేసులో ఆరుగురు నిందితులను అరెస్టు చేసి కిడ్నాప్‌కు ఉపయోగించిన ఇన్నోవా వాహనం, కత్తిని స్వాధీనం చేసుకున్నట్లు తిరుపతి ఈస్ట్ పోలీసు స్టేషన్ ఇన్స్పెక్టర్ పి. రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముద్దాయిలుగా ఉన్న మదనపల్లికి చెందిన సోనియా భానుకు సుమారు మూడు సంవత్సరాలు క్రితం భర్త చనిపోగా సుమారు 8 నెలల క్రితం తిరుపతి పికె లేఔట్‌లో ప్రైవేట్ లాడ్జలు లీజుకు తీసుకొని నడుపుతుండిన వద్దే శ్రీనివాసులు అలియాస్ నానితో పరిచయం కాగా అతనికి వివాహం కానందున ఇల్లు తీసుకొని అతనితో సహజీవనం చేస్తూ తన ఇరువురు మైనర్ ఆడ పిల్లలను తన వద్దే వుంచుకుంది. శ్రీనివాసులు పికె లే అవుట్‌లో పార్ధ డెంటల్ హాస్పిటల్‌కు ఎదురుగా మురళి ఇంటిని అద్దెకు తీసుకుని హోం స్టే నడుపుతూ ఉండేవాడన్నారు. సుమారు ఒక నెల క్రితం సోనియా భానుకు శ్రీనివాసులుకి మనస్పర్థలు వచ్చి సోనియా భాను, శ్రీనివాసులుని, వదిలి, మదనపల్లికి తన పిల్లతో సహా వెళ్ళిపోగా ఇప్పటి నుండి శ్రీనివాసులు సెల్ ఫోన్‌లో సోనియా భానును తిరుపతి వచ్చేయాలని తనతో వుండాలని వేధిస్తూ వుండగా అతని వల్ల ఆమె పిల్లలకు ఏమైనా హాని జరగటానికి అవకాశముందని తలచి అతడ్ని మదనపల్లికి కిడ్నాప్ చేసి తన జోలికే రాకుండా కాలో, చేయ్యే తీసేయాలని సోనియా భానుకి భందువైన పాత కేసులోని నింధితుడు బాబా పక్రుద్దీన్‌ని సంప్రదించగా అతను మదనపల్లికి చెందిన తన స్నేహితులు ఆయన రియాజ్, మోక్షిత్ రాయల్, సందీప్ కుమార్, రాజేశ్‌లతో కలిసి మదనపల్లి నుండి ఇన్నోవా కార్‌ను సెల్ఫ్ డ్రైవింగ్‌కు తీసుకొని సోనియా భాను, బాబా ఫక్రుద్దీన్, రియాజ్, మోక్షిత రాయల్, సందీప్ కుమార్, రాజేశ్‌లతో కలిసి తిరుపతి పికె లేఔట్‌లో శ్రీనివాసులు నడిపే లాడ్జ వద్దకు వచ్చి శ్రీనివాసులు పై దాడి చేసి కత్తి చూపి బలవంతంగా ఇన్నోవా వెహికల్‌లో కిడ్నాప్ చేసుకుని మదనపల్లికి వెళ్తుండగా అప్పటికే కిడ్నాప్ అయిన విషయం మీడియాలో స్క్రోల్ అవుతుండగా వాయల్పాడులో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా శ్రీనివాసులు, కిడ్నాపర్లు ఆదమరచి వుండగా వారి చెర నుండి తప్పించుకుని తిరుపతికి చేరి ఈస్ట్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసారు. శ్రీనివాసులను విచారించి నిందితుల వివరాలు సేకరించారు. బుధవారం ముద్దాయిలను కొర్లగుంట జంక్షన్ వద్ద అరెస్టు చేసి ముద్దాయిలను జుడిషియల్ కస్టడీకి పంపారు. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన తిరుపతి ఈస్ట్ పోలీసు స్టేషన్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ, సబ్ ఇన్స్పెక్టర్ ఈవి నరసింహం, సిబ్బందిని తిరుపతి జిల్లా ఎస్పి సుబ్బరాయుడు అభినందించారు.

## తవణంపల్లెలో ఘనంగా ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం

తవణంపల్లె, డిసెంబర్ 4 ప్రభాతవార్త:



మండల కేంద్రం తవణంపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలోని భవిత కేంద్రంలో బుధవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా భవిత కేంద్రంలోని పిల్లలకు పలు రకాల ఆటల పోటీలను నిర్వహించారు. ఈమేరకు మ్యూజికల్ ఛైర్స్, పరుగుపందాలు, క్యారంబోర్డు, చిత్రలేఖనము తదితర పోటీలను నిర్వహించారు. ఇందులో గెలుపొందిన పిల్లలకు ఎంఈఓ-1 హేమలత చేతుల మీదుగా బహుమతులను ప్రదానం చేశారు. ఈసందర్భంగామాట్లాడుతూ దివ్యాంగులు ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగాలన్నారు. అలాగే మండలంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలు(దివ్యాంగులు) తవణంపల్లెలో భవిత కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో తవణంపల్లె జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం దేవరాజులురెడ్డి, సహిత విద్య ఉపాధ్యాయులు టి.దేవేంద్ర, ఎం.దిలీప్‌లు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి పెన్సింగ్ పోటీల్లో ఐరాల విద్యార్థుల ప్రతిభ



**ఐరాల, డిసెంబర్ 4 ప్రభాతవార్త:** నంద్యాలలో గత నెల 26 నుండి 28 వరకు జరిగిన అండర్-19 పెన్సింగ్ పోటీల్లో ఐరాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచి పతకాలు సాధించినట్లు హెచ్ఎం కోమల తెలిపారు. ఈమేరకు టీమ్ ఈవెంట్ 'సాబర్' విభాగంలో ఆసియా బంగారు పతకంను, లోకేశ్ రజత పతకంలు సాధించినట్లు తెలిపారు. అలాగే ఈపీపీఈ విభాగంలో దినేష్‌రెడ్డి, గణేష్‌లు రజత పతకాలను మైథిలి, మొగిలీశ్వరిలు కాంస్య పతకాలను సాధించినట్లు తెలిపారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచి పతకాలు సాధించిన విద్యార్థులను హెచ్ఎం కోమల, ఉపాధ్యాయులు అభినందించారు. ఈకార్యక్రమంలో పీడీలు దే, లని, ఖేల్ ఇండియా పెన్సింగ్ కోచ్ రాఘవ తదితరులు పాల్గొన్నారు.

## దక్షణాది రాష్ట్రల బిసి సంక్షేమ సంఘ ఇంచార్జీగా షన్ముగం



**చిత్తూరు,డిసెంబర్ 04,ప్రభాతవార్త:** దక్షణాది రాష్ట్రాల బిసి సంక్షేమ సంఘం ఇంచార్జ్‌గా రాష్ట్ర బిసి సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి పి.షన్ముగం నియమిస్తు జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు,మాజీ రాజ్య సభ సభ్యులు ఆర్.క్రిష్ణయ్య ఉత్తర్వులు జారీ చేశారు.రాష్ట్ర బిసి సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్న తనపై నమ్మకంతో జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్.క్రిష్ణయ్య తనను నియమించడంపై ఆయన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానన్నారు.దక్షణాది రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్,తెలంగాణ,తమిళనాడు,కర్నాటక, కేరళ,పాండిచేరి రాష్ట్రాలలో బిసి సంక్షేమ సంఘ నిర్మాణంతో పాటు వెనుకబడిన వారి సమస్యలపైన తాను పూర్తి స్థాయిలో పని చేస్తానని దక్షణాది రాష్ట్రాల బిసి సంక్షేమ సంఘం ఇంచార్జీ పి.షన్ముగం తెలిపారు.తనపై నమ్మకంతో అదనపు బాధ్యతలు అందించిన జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులుకు కృతజ్ఞతలు తెలిపారు.

## డిఈఓను యూటిఎఫ్ ధర్నా నోటీసులు



**చిత్తూరు,డిసెంబర్ 04,ప్రభాతవార్త:** ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరం పరిష్కరించకుంటే ఈనెల 11న జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనునట్లు యూటిఎఫ్ నాయకులు డిఈఓ వరలక్ష్మికి నోటీసులు అందించారు.జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డిఈఓను కలసిన యూటిఎఫ్ నాయకులు మాట్లాడుతూ కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వం ఉపాధ్యాయులను తీవ్ర మానసిక ఒత్తిడికి గురిచేస్తుందన్నారు.అపార్ కార్డుల నమోదు, నిరంతరం బోధనేతర కార్యాక్రమాలతో విలువైన బోధన సమయాన్ని వృధా చేస్తున్నారన్నారు.ఈ సమస్యలపై ప్రభుత్వం ఉపశమనం కల్పించకుంటే ఈనెల 11న డిఈఓ కార్యాలయం వద్ద నిరసన చేపట్టడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర యూటిఎఫ్ కార్యదర్శి జి.వి.రమణ,జిల్లా అధ్యక్షులు ఎం.సోమశేఖర్ నాయుడు తదితరులు ఉన్నారు.

## ఐదేళ్లలో కుప్పం తలరాతను మార్చనున్న సిఎం చంద్రబాబు

**శాసనమండలి విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్**



శాంతిపురం, డిసెంబర్ 4 ప్రభాతవార్త వచ్చే ఐదేళ్లలో సిఎం చంద్రబాబు నాయుడు కుప్పం నియోజకవర్గ తలరాతను మార్చబోతున్నారని శాసనమండలి విప్, ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని అబకలదొడ్డిలో కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ ప్రజా దర్బార్ - మన పంచాయతీ వద్దకే మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా శాసనమండలి విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం హాజరయ్యారు. ఈసందర్భంగా మండలి విప్ డా॥ కంచర్ల మాట్లాడుతూ కుప్పాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా చేయడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. ప్రాజెక్ట్ డైరెక్టర్ అధ్వర్యంలో ప్రజా సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించడం అభినందించదగ్గ విషయమన్నారు. ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ మాట్లాడుతూ కుప్పంలోని 89 పంచాయతీల్లోను ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. గ్రామాల్లోనే ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకే ఈ కార్యక్రమం చేపట్టానన్నారు. ఈసందర్భంగా ప్రజలు వివిధ సమస్యలపై 233వినతిపత్రాలు సమర్పించారు. మధ్యాహ్నంపైన ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ గ్రామంలో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాసులు రాజు, నేతలు విశ్వనాథనాయుడు, జనార్దనరెడ్డి, ఉదయ్, ఎల్.జయరాంరెడ్డి, రమేష్, సత్యేంద్రశేఖర్, జనసేన నరేష్, ఎంపిడిఓ పిఆర్‌కుమార్, తహశీల్దార్ శివయ్య, మహిళా నేతలు అనసూయ, సుగుణమ్మ, భాగ్యలక్ష్మి త్రిలోక్ తదితరులు పాల్గొన్నారు.

## ఎయిడ్స్ వ్యాధి ప్రబలకుండా చూడడం అందరి బాధ్యత

**కుప్పం, డిసెంబర్ 4 ప్రభాతవార్త** సమాజంలో ప్రాణాంతక ఎయిడ్స్ వ్యాధి ప్రబలకుండా చూడడం అందరి బాధ్యత అని కుప్పం పిఇఎస్ వైద్య కళాశాల కమ్యూనిటీ మెడిసిన్ హెచ్ఓడి డా॥ చిత్ర నాగరాజ్ సూచించారు. బుధవారం కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్‌లో ఎయిడ్స్‌పై అవగాహన సదస్సును కెఇసి, పిఇఎస్ వైద్యకళాశాలల సంయుక్త అధ్వర్యంలో నిర్వహించారు.శరీర రక్తమార్పిడి, అవయవ మార్పిడి, అసురక్షితమైన వైద్య విధానాలతో ఎయిడ్స్ వ్యాధి ఇతరులకు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. తల్లికి ఎయిడ్స్ ఉంటే పుట్టే బిడ్డకు కూడా సంక్రమిస్తుందన్నారు. ఎయిడ్స్ వ్యాధి నయం కాని ఓ దీర్ఘకాలిక వ్యాధి అని జీవనశైలిలో మార్పులు, మందులతో నియంత్రించవచ్చన్నారు. వైద్యులు డా॥ దినేష్, డా॥ అనిల్, డా॥ డేవిడ్‌లు హెచ్ఐవి టెస్ట్‌లు తదితరాలపై వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు.ప్రిన్సిపాల్ డా॥ సుధాకర్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ డా॥ భాస్కరన్, ఆర్‌అండ్‌డిడైరెక్టర్‌కోదండరామయ్య, పిఆలు మాధవన్, గంగాధర్, పిఆర్వో ప్రవీణ్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## 2.40లక్షలతో నూతన సిసి రోడ్డు నిర్మాణం పనులు ప్రారంభం

కుప్పం, డిసెంబర్ 4 ప్రభాతవార్త



కుప్పం మున్సిపల్ పరిధి 17వవార్డు నారాయణస్వామి వీధిలో 2.40లక్షల నిధులతో నూతన సిసి రోడ్డు నిర్మాణ పనులను తెదేపా, జనసేన నేతలు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈసందర్భంగా మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, కమీషనర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ 1.40లక్షల ఎంపి లా య్డ్స్ నిధులు, 1లక్ష మున్సిపల్ నిధులతో రోడ్డు నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర నేత గోపీనాథ్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ జిమ్‌దాము, మైనార్టీ సెల్ అధ్యక్షుడు జాకీర్, కౌన్సిలర్లు సోమశేఖర్, తెదేపా నేతలు మంజునాథ్, సుబ్బు, శ్రీధర్, జనసేన చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## గరిగచీనేపల్లి హైస్కూల్‌లో జడ్పీఛైర్మన్ ఆకస్మిక తనిఖీ

కుప్పంరూరల్, డిసెంబర్ 4 ప్రభాతవార్త



మండలంలోని గరిగచీనేపల్లి జడ్పీ హైస్కూల్‌లో బుధవారం జడ్పీఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అపార్ కార్డుల జారీకి ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలనా న్నరు. పదో తరగతి విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి అన్ని సబ్జెక్టులకు సంబంధించి బోధనపై చర్చించారు. పదవ తరగతిలో ఈసారి ఉత్తమ ఫలితాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో జడ్పీటిసి ఎడిఎస్ శరవణ, సర్పంచ్ మురుగేష్, మాజీ సర్పంచ్ ఈశ్వర్ పాల్గొన్నారు.అంతకుముందు బొగ్గుపల్లి గ్రామంలో ప్రభాకర్ కుటుంబీకుల వివాహ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## కత్తార్ ఎన్నారై టిడిపి నాయకులు ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే థామస్‌కు సన్మానం

వెదురుకప్పం, డిసెంబర్ 4 ప్రభాతవార్త :



కత్తార్ ఎన్నారై తెలుగు దేశం పార్టీ నాయకులు రాష్ట్ర ప్రభుత్వ విప్ గంగాధర నెల్లూరు నియోజకవర్గం ఎమ్మెల్యే డాక్టర్ థామస్‌ను బుధవారం ఘనంగా సన్మానించారు. కత్తార్ దేశంలో దోహా పట్నంలో మెడికల్ క్యాంపుకు హాజరైన ఆయనను కత్తర్ టీటీపీ అధ్యక్షులు గొట్టిపాటి రమణయ్య దుశాలువతో ఘనంగా సన్మానించి పుష్ప గుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రమేష్, చంద్రశేఖర్ నాయుడు, సత్యనారాయణ, గోపాల్‌రాజు, రవీంద్ర, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## క్షేత్రస్థాయిలో పంటలు పరిశీలించిన వివిధ రాష్ట్రాల అధికారుల బృందం

కుప్పం, డిసెంబర్ 4 ప్రభాతవార్త



కుప్పంలోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సిఒఇ)లో ఇ ండో - ఇజ్రాయిల్ కూరగాయల అంటుకట్టు విధానం, సాగు విధానాలపై మూడు రోజుల సదస్సు జరుగుతున్న విషయం విదితమే. బుధవారం 12 రాష్ట్రాలకు చెందిన 35మంది ఉద్యానవన అధికారుల బృందం వివిధ రకాల పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అంటుకట్టు విధానం, ఉపయోగాల గురించి శ్రీకృష్ణ కిషోర్ వివరించారు. అనంతరం గ్రాఫ్టింగ్ విధానంను ప్రయోగాత్మకంగా చేపట్టారు. శాంతిపురం మండలం కోనేరుకుప్పంలో విశ్వనాథరెడ్డి తోటలో వంగ మొక్కల సాగు, గంగవరం మండలం గండ్రాజుపల్లికి చెందిన శ్రీనివాసులు గ్రీన్ ఆర్బిట్ ఫార్మ్‌లో నేల రహిత పంటసాగును అధికారులు పరిశీలించారు. కార్యక్రమంలో న్యూఢిల్లీ ఇండో - ఇజ్రాయిల్ ఎంబసీ ప్రతినిధి ఉరీ రూబిన్ స్టీన్, ప్రాజెక్ట్ అధికారి బ్రహ్మదేవ్, జిల్లా ఉద్యానవన అధికారి మధుసూధన్‌రెడ్డి, ఏపిఎంఐపి అధికారి బాలసుబ్రమణ్యం, ఉద్యానవన ఎడి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

## ఆర్టీసీలో అద్దె డ్రైవర్లు.. ఔట్ సోర్సింగ్ కార్మికులకు న్యాయం చేయాలి

**- ఎఐటియుసి జిల్లా గౌరవాధ్యక్షుడు నాగరాజు**



**కుప్పం, డిసెంబర్ 4 ప్రభాతవార్త** జిల్లాలోని ఆర్టీసీ డిపోల్లో పనిచేస్తున్న ఆన్‌కాల్, అద్దె డ్రైవర్లకు ఔట్ సోర్సింగ్ కార్మికులకు అధికారులు న్యాయం చేయాలని ఎఐటియుసి జిల్లా గౌరవాధ్యక్షుడు నాగరాజు డిమాండ్ చేశారు. బుధవారం కుప్పం డిపోలో ఎపిపిడిటి ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి బలరాంమూర్తి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. సుప్రీంకోర్టు తీర్పు మేరకు సమాన పనికి సమానవేతనం చెల్లించాలని పేర్కొన్నారు. పర్మినెంట్ డ్రైవర్లతో సమానంగా బస్సులు నడిపే ఆన్‌కాల్, అద్దె డ్రైవర్లకు ఎలాంటి సదుపాయాలు లేకపోవడం దారుణమన్నారు. ఆన్‌కాల్ డ్రైవర్లకు ఇచ్చే వేతనాలు మనరాష్ట్రంతో పోల్చితే తేడా అధిక ంగా ఉందన్నారు. దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు దామోదరం మాట్లాడుతూ కార్మికులు సమస్యల పరిష్కారంకై ఐక్యంగా పోరాడాలని అందుకు తమ మద్దతు ఉంటుందని పేర్కొన్నారు. సమావేశంలో ఇయు డిపో అధ్యక్షుడు చెంగలరాయప్ప, కార్యదర్శి కరుణాకర్, విశ్వనాథం, మురళీధర్, డ్రైవర్లు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

రామకుప్పం, డిసెంబర్ 4 ప్రభాతవార్త



సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు మండలంలో ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తామని మండల టిడిపి అధ్యక్షుడు ఆనందరెడ్డి పేర్కొన్నారు. బుధవారం గడ్డూరు గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తున్నట్లు ఆయన తెలిపారు. గ్రామాల్లో రోడ్లు, డ్రైన్లు, వీధి లైట్లు, పెన్షన్లు, భూసమస్యలు, మరుగుదొడ్లు, తాగునీటి సమస్య, గృహనిర్మాణం తదితర అంశాలపై చర్చించారు. ఎంపిడిఓ లక్ష్మీకాంత్, డిటి బాలాజీ, నేతలు శ్రీనాథరెడ్డి, పెరుమాళ్, చంద్రశేఖర్‌రెడ్డి, సుబ్రమణ్యం, మురళి పాల్గొన్నారు.

## వరసిద్ధుని దర్శించుకున్న పెనమలూరు ఎమ్మెల్యే

**కాణిపాకం, డిసెంబర్ 4 ప్రభాతవార్త:** పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ బుధవారం కుటుంబసమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ సూపరెండెంట్‌లు కోదండపాణి, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. వారికి వేదమండపంలో వేదాశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను, చిత్రపటాన్ని అందజేశారు. అలాగే శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా వారు పూజలు నిర్వహించారు. వారి వెంట టెంపుల్ ఇన్స్‌పెక్టర్ రవి పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోను రాణించాలి - ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్



**- అండర్ - 17 త్రోబాల్ జిల్లా జట్ల ఎంపిక !!**

కుప్పం, డిసెంబర్ 4 ప్రభాతవార్త

విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోను రాణించాల్సిన అవసరం ఉందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్ సూచించారు. బుధవారం టి.సదుమూరు జడ్పీ హైస్కూల్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ -17 త్రోబాల్ జిల్లా జట్ల ఎంపిక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నంలు హాజరై జ్యోతిప్రజ్వలన చేశారు.అనంతరం ఎమ్మెల్సీ డా॥ కంచర్ల మాట్లాడారు. క్రీడలు శారీరక, మానసికోల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు క్రీడలపై మక్కువ చూపి రాణిస్తే ఉన్నత స్థాయికి ఎదగవచ్చున్నారు. సిఎం చంద్రబాబునాయుడు కూడా క్రీడలకు ఎంతో ప్రోత్సాహం అందిస్తారన్నారు. గ్రామీణ విద్యార్థులు మట్టిలో మాణిక్యాలుగా విద్య, క్రీడా రంగాల్లో రాణించాలని సూచించారు. క్రీడాస్ఫూర్తితో ముందుకుసాగాలన్నారు. అనంతరం జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులను అభినందించారు.కార్యక్రమంలో మాజీ ఎంపిపిలు సాంబశివం, డా॥ వెంకటేష్, నేతలు సత్యేంద్రశేఖర్, రామచంద్ర, మోహన్, జనసేన నరేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వర్షంతో దెబ్బతిన్న పంటల పరిశీలన



చౌడేపల్లి, డిసెంబర్ 4 ప్రభాతవార్త

తుఫాన్ కారణంగా కురిసిన వర్షాలకు దెబ్బతిన్న వరి పంటను వ్యవసాయాధికారులు పరిశీలించారు. మండలంలోని చారాల, పెద్దకొండామర్రి, 29ఎ.చింతమాకులపల్లి పంచాయతీ గ్రామాలకు చెందిన రైతుల వరి పంటను పుంగనూరు ఎడిఎ శివకుమార్ పరిశీలించారు. పంటనష్టం సంభవించిన రైతులు ఆయా రైతు సమాచార కేంద్రాల్లో అధికారుల దృష్టికి తీసుకెళ్ళాలన్నారు. అనంతరం మండల వ్యాప్తంగా తుఫాన్ వల్ల జరిగిన నష్టాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తున్న వివరించారు. మండల వ్యవసాయాధికారిణి జ్యోతమ్మ, ఆయా గ్రామాలకు చెందదిన రైతులు పాల్గొన్నారు.

## మారుతున్న కాలానుగుణంగా మార్పు రావాలి : శివకుమార్

చౌడేపల్లి, డిసెంబర్ 4 ప్రభాతవార్త



మారుతున్న కాలానుగుణంగా రైతుల్లోనూ మార్పు రావాలని పుంగనూరు వ్యవసాయశాఖ ఎడిఎ శివకుమార్ అన్నారు. మండలంలోని ఆమినిగుంట, చారాల పంచాయతీ గ్రామాల్లో ఆయన పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. మార్కెట్‌కు అనుకూలంగా వుండే పంటలపై రైతులు దృష్టి సారించాలన్నారు. వరి, టమోటా వంటి వాణిజ్య పంటల యాజమాన్యపద్ధతులపైఅవగాహనకల్పించారు. మండల వ్యవసాయాధికారిణి జ్యోతమ్మ, రైతులు పాల్గొన్నారు.

## రేపటి నుంచి రెవిన్యూ సదస్సులు

చౌడేపల్లి, డిసెంబర్ 4 ప్రభాతవార్త

ఈనెల 6నుంచి మండలంలో రెవిన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ హనుమంతు తెలిపారు. ఆయన స్థానిక కార్యాలయంలో మాట్లాడుతూ 6న ఎ.కొత్తకోట, 7న దుర్గసముద్రం, 10న చారాల, 11న శెట్టిపేట, 12న పందిళ్ళపల్లి, 13న చౌడేపల్లి, 17న గడ్డంవారిపల్లి, 18న కొండామర్రి, వెంగళపల్లి, 19న ఆమినిగుంట, 20న దిగువపల్లి, 21న కాగతి, 24న కాటిపేరి, 26న లద్దిగం, 27న పుదిపట్ల, 28న చింతమాకులపల్లి, 30న పెద్దయల్లకుంట్లలో నిర్వహిస్తామన్నారు. ఆయా గ్రామాల సచివాలయాల వద్ద జరిగే కార్యక్రమాల్లో ప్రజలు పాల్గొని సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. సమావేశంలో ఆర్ఐ భారతి హాజరయ్యారు.

## సభ్యత్వ నమోదు కార్యక్రమం



కల్లూరు, డిసెంబర్ 4, ప్రభాతవార్త

పుంగనూరు నియోజకవర్గ ఇన్చార్జి వర్యులు యంగ్ డైనమిక్ లీడర్ చల్లా రామచంద్ర రెడ్డి ఆదేశానుసారం పులిచెర్ల మండలం పోసంవారీ పల్లి పంచాయితీలో పార్టీ సభ్యత్వ కార్యక్రమం వి సి వడ్డిపల్లి పోశంవారిపల్లి, దిన్నుపాటి వారి పల్లి సాధుబడివారిపల్లి గోపాలపురంలో సభ్యత్వాలు 100 పైగా చేయడం జరిగింది. బాలాజీ, ప్రభాకర్, దాము, ప్రకాష్ నాయుడు, గోపినాయుడు మని, హరి, లోకేష్, సురేఖ, డిల్లి పాల్గొన్నారు.

## సుమో వాహనంతో సహా 1600కిలోల తమిళబియ్యం సీజ్

కుప్పంరూరల్,డిసెంబర్ 4 ప్రభాతవార్త




తమిళనాడులో పేదలకు అందించే బియ్యాన్ని అక్రమంగా కర్ణాటకకు తరలించేందుకు నిల్వ ఉంచిన 1600కిలోల బియ్యంతో పాటు టాటా సుమో వాహనాన్ని రూరల్ సిఐ మల్లేష్ యాదవ్ అధ్వర్యంలో పోలీసులు సీజ్ చేశారు. మండలంలోని కూసూరుకు చెందిన మాదమ్మ, రాజప్ప, తీర్థగిరి అనే వ్యక్తులు తమిళబియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచినట్లు తెలిసింది. తమిళబియ్యం అక్రమ రవాణాకు సంబంధించి వీరిపై ఇదివరకే పలు కేసులు ఉన్నట్లు సమాచారం.

## విద్యాశాఖ అసంబద్ధ నిర్ణయాలను వెనక్కు తీసుకోవాలి

**ఐరాల, డిసెంబర్ 4 ప్రభాతవార్త:** విద్యాశాఖాధికారులు తీసుకుంటున్న అసంబద్ధ నిర్ణయాలను వెంటనే వెనక్కు తీసుకోవాలని డిమాండు చేస్తూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో మండలంలోని ఉపాధ్యాయులు బుధవారం మండల విద్యాశాఖాధికారులకు వినతిపత్రం అందజేశారు. మండల యూటీఎఫ్ అధ్యక్షుడు జి.దేవరాజులు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా సంఘం జిల్లా కార్యదరి ్శ ఏకాంబర్ మాట్లాడుతూ గత ప్రభుత్వ విధానాలకు, ప్రస్తుత ప్రభుత్వ విధానాలకు ఎంటువంఇ తేడా లేదన్నారు. విద్యాశాఖ అధికారులు తీసుకుంటున్న నిర్ణయాల వల్ల ఉపాధ్యాయులు మానసిక ఆందోళనలో వున్నారని తెలిపారు. కావున ఈసంబద్ధ నిర్ణయాలను వెంటనే వెనక్కు తీసుకోవాలని వారు డిమాండు చేస్తూ వినతి పత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి అరుణ్‌కుమార్, కార్యదర్శులు గుణసుందరి,షభానా, వాణి, ప్రభాకర్, ఉపాధ్యాయులు

# తిరుపతి డివిజన్

## గ్రామీణ ప్రాంతాల్లో చిద్రమైన రోడ్లు-అవస్థల్లో ప్రజలు

.తొట్టంబేడు, డిసెంబర్ 4 ప్రభాతవార్త



ఫెంగాన్ తుఫాను ప్రభావం తీరం దాటిందనుకునేలోపు బుధవారం ఉదయం నుంచి ఎడతెరపిలేని వర్షం కురుస్తుండడంతో ఇటు గ్రామీణ ప్రాంతాల ప్రజలు, అటు పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు అస్తవ్యస్తంగా మారడంతో ద్విచక్రవాహనచోదకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాగా నాయుడుపేట హైవే మార్గంలోను వర్షానికి కొత్తగా వేసిన రోడ్లు కూడా చిద్రమవడంతో వాహనదారులు ఎటూ వెళ్ళాల్సిన పరిస్థితి తలెత్తుతోంది. ఇక గ్రామీణ ప్రాంతాలకు వెళ్ళేందుకు బోర్డులు లేకపోవడంతో గ్రామస్తులు ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యంగా దళితవాడల్లో దయనీయ పరిస్థితి ఎదురవుతోంది. పలు గ్రామాల్లోని దళితవాడల్లో రోడ్లు బురదమయంగా మారడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది.గత ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో డ్రైనేజీ కాలువలు నిర్మించకపోవడంతోనే గ్రామాల్లో ఈపరిస్థితి నెలకొంది. ఇక రోడ్లపైనే వర్షపునీరు నిలవడంతో పాదాచారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఎప్పటికప్పుడు స్పందించి గ్రామాల్లో వైద్యసేవలు అందించడంతోపాటు ఇంటింటా జ్వరం, జలుబు, దగ్గులకు సంబంధించిన సిరప్‌లు, మాత్రలు అందించాల్సిన అవసరం ఉంది.

## నియోజకవర్గ కాపునాడు అధ్యక్షులుగా సతీష్‌కుమార్



.శ్రీకాళహస్తి, డిసెంబర్ 4 ప్రభాతవార్త

నియోజకవర్గ కాపునాడు అధ్యక్షుడుగా సతీష్‌కుమార్‌ను నియమిస్తూ జాతీయ కాపు సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు కర్ణమురళీకృష్ణనాయుడు ఉత్తర్వులు అందించారు. ఈసందర్భంగా సతీష్‌కుమార్ మాట్లాడుతూ తనకు అప్ప గించిన కాపు జాతీయ అధ్యక్షుడు కర్ణమురళీకృష్ణనాయుడుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తాను నియోజకవర్గంలో కాపుల సంక్షేమం కోసం అభివృద్ధికి తన వంతు కృషిచేస్తామని తెలిపారు.

## ఫెజావర్ పీఠాధిపతికి శ్రీవారి ఆశీస్సులు



**తిరుమల,డిసెంబర్ 4ప్రభాతవార్తప్రతినిధి:** ఉడిపి ఫెజావర్ పీఠాధిపతి విశ్వేశప్రసన్నతీర్థస్వామి బుధవారంఉదయంశిష్యులతో కలసి శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు.ఆలయం వద్ద టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, టిటిడి వింగ్ విఎస్ఓ ఎస్వీవిరామ్‌కుమార్ స్వాగతం పలికి స్వామివారి అందజేశారు.

## చౌకదుకాణాల్లో నాణ్యమైన సరుకులు అందించండి

శ్రీకాళహస్తి, డిసెంబర్ 4 ప్రభాతవార్త



చౌకదుకాణాల్లో నాణ్యమైన సరుకులు అందించాలని కోరుతూ రాష్ట్ర పౌర సరఫరాలశాఖ మంత్రి జనసేన పార్టీ పిఏసి ఛైర్మన్ నాదెండ్ల మనోహర్‌ను బుధవారంవిజయవాడలో శ్రీకాళహస్తి నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌ఛార్జి వినుత కోట మర్యాదపూర్వకంగా కలసి శివయ్య తీర్థప్రసాదాలను అందించారు.ఈసందర్భంగా వినుత కోట మాట్లాడుతూ చౌకదుకాణాల్లో కేవలం బియ్యం, అప్పుడప్పుడు చక్కెర మాత్రమే ఇస్తున్నారని, కందిపప్పు కూడా ఇవ్వడం లేదని ఇప్పటికే పెరుగుతున్న ధరలతో అల్లాడుతున్న జనంకు చౌకదుకాణాల ద్వారా నిరుపేద ప్రజలకు సరుకులు అందించాలన్నారు. రేషన్ డీలర్లు అందరు బియ్యం ఉచితంగా ఇస్తున్నారు కానీ కందిపప్పుకు మాత్రం డిడిలు చెల్లించేందుకు ముందుకురావడం లేదని మంత్రి దృష్టికి తెచ్చారు. ఇకనైనా ప్రభుత్వం డీలర్లచే బియ్యం, చక్కెరతో పాటు కందిపప్పును కూడా అందించాలని మంత్రిని కోరారు. కోట చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

## వినాయకునికి పంచలోహ కవచం వితరణ

శ్రీకాళహస్తి, డిసెంబర్ 4 ప్రభాతవార్త



పట్టణంలోని పానగల్‌లో వెలసిన పొన్నాలమ్మ ఆలయ ఆవరణలో వెలసిన వినాయక స్వామికి డాక్టర్ మేలచ్చూరుచంద్రశేఖర్ కుటుంబసభ్యులు బుధవారం పంచలోహ కవచాన్ని వితరణగా అందించారు. ఈసందర్భంగా దాతలకు ఆలయ ఛైర్మన్ పుదూరు లక్ష్మణ్‌రెడ్డి, ఆలయ పూజారి జగదీష్‌లు వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపి అమ్మవారి తీర్థప్రసాదాలు అందించారు.

## రెవెన్యూశాఖ మంత్రిని కలసిన మాజీ ఎంఎల్ఏ ఎస్సీవీ

.శ్రీకాళహస్తి, డిసెంబర్ 4 ప్రభాతవార్త



రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్‌ని మాజీ ఎంఎల్ఏలు ఎస్సీవీ నాయుడు, సత్రవాడ మునిరామయ్యలు మర్యాదపూర్వకంగా కలశారు. ఈసందర్భంగా వారు మంత్రిని దుశ్శాలువతో సత్కరించి శ్రీకాళహస్తీ శ్వరస్వామివారి తీర్థప్రసాదాలను అందించారు. అనంతరం మాజీ ఎంఎల్ఏలు మాట్లాడుతూ శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఉన్న రెవెన్యూ సమస్యలను పరిష్కరిం చాలని మంత్రికి వివరించారు. మంత్రిని సత్కరించిన వారిలో టిడిపి నాయకులు ప్రకాష్‌నాయుడు, గోగినేని భాస్కర్‌నాయయుడు, జానకిరామానాయుడు, సురేష్‌నాయుడు, సత్రవాడ ప్రవీణ్ పాల్గొన్నారు.

## ఆక్రమణలు తొలగించండి

**-వ్యాపారుల అక్రమాలపై ఛైర్మన్ అసహనం**



**తిరుమల,డిసెంబర్ 4ప్రభాతవార్తప్రతినిధి:** కొండపై నిబంధనలు అతిక్రమించి వ్యాపారాలు చేస్తున్న వ్యాపారులపై, టిటిడి అధికారుల తీరుపై ఛైర్మన్ బిఆర్‌నాయుడు అసహనం వ్యక్తం చేశారు. దుకాణాదారులు కేటాయించిన స్థలాలను అతిక్రమించి ఆక్రమించుకున్నా చూస్తూ ఎందుకు మిన్నకుండి పోయారని ఛైర్మన్ ఆగ్రహం చెందారు. వ్యాపారులు లైసెన్స్ పొందిన సమయంలో పేర్కొన్న నిబంధనల మేరకు వ్యాపారాలుచేసుకోవాలని,అనధికారఆక్రమణలకు పాల్పడితే చర్యలు తప్పవని నాయుడు హెచ్చరించారు.

## సత్తా చాటారు!

**-టిటిడి వివిఎస్ఓలకు పతకాలు**



**తిరుమల,డిసెంబర్ 4ప్రభాతవార్తప్రతినిధి:** అఖిలభారత పోలీస్ లాన్‌టెన్నీస్ ఛాంపియన్‌షిప్‌లో టిటిడి విజిలెన్స్ విభాగం విఎస్ఓలు సత్తాచాటారు. విశేష ప్రతిభకనబరచి పతకాలను కైవశం చేసుకున్నారు. బెంగుళూరు కబ్బన్‌పార్కులోని రాష్ట్ర లాన్‌టెన్నీస్ స్టేడియంలో సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ 25వ అఖిల భారత పోలీసు లాన్‌టెన్నీస్‌లో మన రాష్ట్రం నుండి టిటిడి విజిలెన్స్ విభాగం విఎస్ఓలు నెట్టంతులసీవెంకట రామ్‌కుమార్ (వింగ్‌విభాగం),తిరుమల విఎస్ఓ అల్లం సురేంద్ర పతకాలు అందుకున్నారు. విఎస్ఓలు రామ్‌కుమార్,సురేంద్రను టిటిడి ఈఓ జె.శ్యామలరావు, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, సివిఎస్ఓ శ్రీధర్ ప్రత్యేకంగా అభినందించారు.

## ఎస్ జీ ఎస్ క్యాంపస్ డ్రైవ్లో 14 మందికి ఉద్యోగాలు

తిరుపతి విద్య డిసెంబర్ 04 ,ప్రభాతవార్త:



టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న ఎస్ జీ ఎస్ ఆర్ట్స్ కళాశాలలో చెన్నైకి చెందిన సౌతరన్ ఇన్ఫోటెక్ కంపెనీ ఆధ్వర్యంలో బుధవారం కళాశాల నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్లో 14 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారు.బీఏ,బీకాం,బీఎస్సీ ఫైనల్ ఇయర్ చదువుతన్న సుమారు వందమంది విద్యార్థులు క్యాంపస్ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు.అనంతరం ప్రిన్సిపల్ డాక్టర్ బి సత్యనారాయణ మాట్లాడుతూ ఎస్ జీ ఎస్ విద్యార్థులు క్యాంపస్ డ్రైవ్ లో ప్రతిభ చూపి వార్షిక వేతనం రూ.2.5 లక్షల నుంచి రూ 3.5 లక్షలతో ఉద్యోగాలు సాధించడం గర్వకారణమన్నారు.ఉపాధే లక్ష్యంగా విద్యార్థులకు నాణ్యమైన బోధనతో పాటు,నైపుణ్యాభివృద్ధి శిక్షణను అందిస్తున్నామన్నారు.ఎంపికైన విద్యార్థులకు ఈ సందర్భంగా ఆయన అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్లేస్మెంట్ ఆఫీసర్ చంద్రయ్య,నోడల్ ఆఫీసర్ సుజాత,కోటేశ్వరయ్య,కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## క్యూఆర్‌కోడ్‌తో సులభంగా విద్యుత్ బిల్లులు చెల్లింపు



-బకాయిలు ఉంటే కోడ్ పనిచేయదు -ఎస్‌పిడిసిఎల్ ఎస్ఈ సురేంద్రనాయుడు

**తిరుపతి(రవాణ),డిసెంబర్ 4(ప్రభాతవార్త):** విద్యుత్ వినియోగదారులు ఇకపై సులభంగా వారికి అందిన బిల్లులో ఉన్న క్యూఆర్ కోడ్ స్కాన్‌చేసి విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చని ఎస్‌పిడిసిఎల్ ఎస్ఈ సురేంద్రనాయుడు తెలిపారు. బిల్లులు బకాయి ఉన్న వినియోగదారులకు ఈ క్యూఆర్ కోడ్ పనిచేయదని చెప్పారు. తిరుపతి నగరం పరిసరాల్లోని అన్ని ప్రాంతాల వినియోగదారులు ఇకనుండి సులభపద్ధతిలో బిల్లులు చెల్లింపుకు క్యూఆర్ కోడ్ ఎస్‌పిడిసిఎల్ అందుబాటులోకి తీసుకువచ్చిందని, డిసెంబర్ నెలనుండి అందించే విద్యుత్ బిల్లులపైఈ కోడ్ ముద్రించడం జరిగిందన్నారు. ఈ క్యూఆర్ కోడ్ స్కాన్‌చేసి విద్యుత్ బిల్లులు చెల్లింపు ప్రక్రియ సరళతరం చేయడం జరిగిందన్నారు. స్కాన్‌చేసి గూగుల్‌పే, ఫోన్‌పే ద్వారా బిల్లులు చెల్లించవచ్చాన్నారు. గత నెల బిల్లు చెల్లించని వారికి, బకాయి ఉన్న వినియోగదారులకు ఈకోడ్ కనిపించదన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో ఎస్ఎఇ శ్రీనివాసులు, ఎఇ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

## బీసీలలో ఉన్న వర్గీకరణ ఎస్సీలలో ఎందుకు లేదు



**తిరుపతి హెల్త్, డిసెంబర్ 4, ప్రభాతవార్త** బీసీలలో ఏబిసిడి వర్గీకరణ ఉన్నప్పుడు ఎస్సీలలో ఇది ఎందుకు కొరవడిందని ఎమ్మార్పీఎస్ (మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి) జాతీయ నాయకులు డాక్టర్ మున్నంగి నాగరాజు ప్రశ్నించారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో బుధవారం మీడియా ముందు ఎమ్మార్పీఎస్ నాయకులు సురేష్, నరేంద్ర, రామకృష్ణ , గోపి, వాసు, రాజేంద్ర , గోపాల్ తదితరులతో కలిసి నాగరాజు మాట్లాడుతూ ఎన్ డి ఏ కూటమిల విజయం కోసంతాముకష్టపడ్డామని గుర్తుచేశారు.సీఎంచంద్రబాబుస్వచ్ఛమైనహామీలనుఇచ్చారని, దాన్ని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. తమ మాల సోదరులు తమ నేత మందకృష్ణ మాదిగను దూషించడం సరికాదన్నారు. ఎస్సీలలో తాము సమానంగా కలిసిమెలిసి జీవిస్తామని మాల కులస్తులను సోదర భావంతో కోరారు.

## బ్లూమింగ్ బడ్స్‌లో "పరాక్ రాష్ట్రీషియ సర్వేక్షణ్" సర్వే



**చంద్రగిరి, డిశంబర్ 4 ప్రభాతవార్త:** స్థానిక ఆర్ఎఫ్ రోడ్డులోని బ్లూమింగ్ బడ్స్ స్కూల్లో బుధవారం 6వ తరగతి విద్యార్థులకు "పరాక్ రాష్ట్రీయ సర్వేక్షణ్" (నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే 2024) పై పరీక్ష నిర్వహించారు. ఈ కేంద్రానికి ఎంఈఓ భాస్కర్ బాబు నోడల్ ఆఫీసర్‌గా వ్యవహరించారు. ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్‌గా శారద, అబ్జర్వర్‌గా అనుప్రియ వ్యవహరించారు. పరీక్షా కేంద్రాన్ని ఎంఈఓ శ్రీవరం లలితకుమారి తనిఖీ చేశారు.కరస్పాండెంట్.బి.హితేంద్రనాథ్‌రెడ్డి,ప్రిన్సిపాల్ వేణుగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

## వంద శాతం ప్రకృతి వ్యవసాయం లక్ష్యం..!

జిల్లా ప్రకృతి వ్యవసాయ విభాగం డిపిఎం షణ్ముగం

**రామచంద్రాపురం, డిశంబర్ 4 ప్రభాతవార్త:**

ప్రకృతి వ్యవసాయాన్ని రైతులు వంద శాతం పండించే దిశగా మహిళా సంఘాలు ముందుకెళ్ళాలని జిల్లా ప్రకృతి వ్యవసాయ విభాగం డిపిఎం షణ్ముగం అన్నారు. స్థానిక ఎంఎంఎస్ కార్యాలయంలో బుధవారం గ్రామ సంఘం లీడర్స్, బుక్ కీపర్స్, ఈసి మెంబర్స్‌కు రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణలో ఎటిఎం మోడల్స్ ఎ గ్రేడ్ మోడల్స్, డిఆర్‌పిఎస్ మోడల్స్‌పై పూర్తి శిక్షణ ఇస్తూ ప్రకృతి వ్యవసాయ ఇన్‌ఫుట్స్‌ను ప్రదర్శిస్తూ నేర్పించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా డిఆర్‌డిఎ పిడి శోభన్‌బాబు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ ఉద్యమాన్ని మహిళా సంఘాలు ఉద్యమ స్ఫూర్తి ముందుకు తీసుకెళ్ళాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్‌పి భానుమూర్తి, ఎపిఎం గురుమూర్తి, బిపిఎం దుర్వాసులు నాయుడు, మోడల్ టిఎస్ విమల, మధు, నీలమ్మ, సిసిలు, విఓలు పాల్గొన్నారు.

## షెల్ ఇండియా సహకారంతో స్మైల్ ఫౌండేషన్ "ఎన్ఎక్స్-కార్నర్ ల్యాబ్"



**చంద్రగిరి, డిశంబర్ 4 ప్రభాతవార్త:** షెల్ ఇండియా సహకారంతో స్మైల్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో ఎన్ఎక్స్-కార్నర్ ల్యాబ్ ఏర్పాటు చేయడం ఆనందంగా వుందని ఎంఈఓ శ్రీవరం లలితకుమారి అన్నారు. స్థానిక శ్రీపద్మావతీ జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం ఆమె ఎన్ఎక్స్-కార్నర్ ల్యాబ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రూ.2 లక్షలు విలువ కలిగిన (స్మార్ట్ టివి, ల్యాప్ ట్యాప్, ఇన్వెటర్, సైన్స్ ప్రాజెక్ట్ మెటీరియల్, కార్నర్ పెయింటింగ్) ఎన్ఎక్స్ కార్నర్ ల్యాబ్స్‌ను తిరుపతి జిల్లాలోని 10 పాఠశాలలో ఏర్పాటు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం వెంకటరమణ రెడ్డి, స్మైల్ ఫౌండేషన్ ప్రతినిధి లోకేశ్వరి, రఫీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ విజయవంతం చేయండి..!

**రామచంద్రాపురం, డిశంబర్ 4 ప్రభాతవార్త:**

మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆర్జేడి శామ్యూల్ అన్నారు. బుధవారం కెకెవి పురం జడ్పీ హైస్కూల్‌ను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మెగా టీచర్స్ పేరెంట్స్ మీటింగ్‌ను ఆరా తీసిన ఆయన ఇందులో విద్యార్థుల ప్రగతిని వివరించాలని హెచ్ఎం భాస్కర్‌ను ఆదేశించారు. ఈ నెల 9 నుండి 19 వరకు సమ్మేటీవ్-1 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించారు. పదవ తరగతి విద్యార్థిలను పబ్లిక్ పరీక్షలకు సిద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## స్విమ్స్ ఆధ్వర్యంలో ప్రపంచ వికలాంగుల దినోత్సవం



**తిరుపతి హెల్త్, డిసెంబర్ 4 ప్రభాతవార్త :** శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపీ ఆధ్వర్యంలో ప్రపంచ వికలాంగుల దినోత్సవం సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహించినట్లు స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డా రామ్ తెలియజేశారు. స్విమ్స్ ఫిజియోథెరపి కళాశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా. ఆర్.వి.కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడుతూ వికలాంగుల హక్కులు, శ్రేయస్సును ప్రోత్సహించడానికిరాజకీయ, సామాజిక, ఆర్థిక మరియు సాంస్కృతిక రంగాలలో వికలాంగుల స్థితిగతులపై అవగాహన పెంచడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమానికి కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపి ప్రిన్సిపాల్ డా మాధవి, డా విశ్వనాథ్ రెడ్డి, డా శాంతి పాల్గొన్నారు.

## ఘనంగా దివ్యాంగుల దినోత్సవం : ఎంపీడీవో

**సత్యవేడు, డిసెంబరు 4 ప్రభాతవార్త:** సమాజాభివృద్ధిలో అంగవైకల్యం ఉన్న వారిని ప్రోత్సహించడమే అందరి కర్తవ్యమని సత్యవేడు ఎంపీడీవో చంద్రశేఖర్ అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంఈవో రవి అధ్యక్షతన అంతర్జాతీయ దివ్యాంగుల వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీడీవో చంద్రశేఖర్ మాట్లాడుతూ అంగ వికలాంగులను ప్రోత్సహించడం ప్రభుత్వ బాధ్యతే కాదు సమాజంలో ఉన్న ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. అంగ వికలాంగుల దినోత్సవం పురస్కరించుకుని పలువురు దివ్యాంగులకు ఎంపీడీవో, స్థానిక ఎంఈవో బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎంఈవో-2 ఉష, ఐఈఆర్‌టీలు దివ్యకుమారి, వెంకటరత్నం, పలువురు వికలాంగుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## శివయ్య సన్నిధిలో అతిథులు

**శ్రీకాళహస్తి, డిసెంబర్ 4 ప్రభాతవార్త :** శ్రీకాళహస్తీశ్వరాలయానికి శ్రీహరికోట షార్ నుంచి పిఎస్ఎల్‌వి-సి59 ప్రోబా-3 రాకెట్ ప్రయోగం విజయవంతం కావాలని శ్రీహరికోట షార్ అధికారులు యశోద, యంఎస్.గుప్తా మరియు షార్ అధికారులు శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానానికి విచ్చేసి స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. కాగా రాజ్యసభ సభ్యుడు సతీష్‌చంద్ర మిశ్రా కుటుంబ సభ్యులతో శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానానికి అధికారులు స్వాగతం పలికి స్వామిఅమ్మవార్ల దర్శనం చేయించారు.

## రామాపురం చెరువు గండిని పరిశీలించిన ఎస్ఇ

**శ్రీకాళహస్తి, డిసెంబర్ 4 ప్రభాతవార్త :**

శ్రీకాళహస్తి మండలం రామాపురం చెరువుకు గండి పడింది. విషయం తెలుసుకున్న ఎస్ఇ మదనగోపాల్ తెల్లారేసరికి చెరువును పరిశీలించారు. వేకువ జాము 3గంటల సమయంలో చెరువుకు గండి పడటంతో శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి స్పందించారు. వెంటనే గ్రామస్థుల కన్నా శాసనసభ్యుడు ఇరిగేషన్ ఎస్ఇకు సమాచారం ఇవ్వటంతో ఆయన హుటాహుటిన తన సిబ్బందితో రామాపురం గ్రామానికి చేరుకున్నారు.అక్కడ వృధాగా పోతున్న నీటిని అడ్డుకొనుటకు గ్రామస్థుల సహాయంతో ఇసుక బస్తాలను వేసారు. రింగ్‌బండ్ ఏర్పాటుకు ఇరిగేషన్ అధికారులకు బాధ్యత అప్పగించారు. ఎక్కడ చెరువులకు ఇబ్బంది పడినా వెంటనే ఇరిగేషన్ అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. చాలా చెరువుల్లోకి నీరు చేరుతుంది.

## శ్రీకాళహస్తి అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టండి...

-దేవస్థానం పగ్గాలు ప్రవీణ్‌కు ఇవ్వండి -మాజీలు సిఎంకు మొర

**శ్రీకాళహస్తి, డిసెంబర్ 4 ప్రభాతవార్త :**

శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించి పార్టీపై జనం పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము కాకుండా చూడాలని పార్టీలో సీనియర్లకు గుర్తింపు ఇవ్వాలని పార్టీ బలోపేతానికి అందరిని కలుపుకొని పోవుటకు శ్రదధ చూపాలని మాజీ శాసనసభ్యుడు ఎస్‌సివి నాయుడు సిఎంను కలసి అభ్యర్థించారు. కాగా పార్టీ అవిర్భావం నుంచి పార్టీకి మద్దతుగా ఉంటూ నిజాయితిగా వ్యవహరిస్తున్న తన కుమారునికి శ్రీకాళహస్తీశ్వరాలయం ధర్మకర్తల మండలి పగ్గాలను ఆందించి ఆలయ పవిత్రతను కాపాడాలని మాజీ శాసనసభ్యుడు సత్రవాడ మునిరామయ్య ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కలసి అభ్యర్థించారు. శ్రీకాళహస్తిలో పార్టీని గెలిపించుకొనుటకు పార్టీ ఆవిర్భావం నుంచి ఉన్న వారికి గుర్తింపు ఇవ్వాలని కోరారు. గతంలో పరిపాలించిన నాయకుల అవినీతి,అక్రమాలకు సంబందించి జనానికి తెలియాల్సి ఉందని భూకబ్జాలు, రాజీవ్‌నగర్‌లో అక్రమ ఆక్రమణలు, అనుచరుల వ్యాపారాలపై ప్రత్యేక విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని మాజీ శాసనసభ్యులు సత్రవాడ మునిరామయ్య, ఎస్‌సివి నాయుడులు ముఖ్యమంత్రిని కోరారు.

## ప్రతికేసు ఆరోగ్యశ్రీలో నమోదు చేయండి



**నగరి, డిసెంబరు 4 ప్రభాతవార్త:** ఆస్పత్రికి విచ్చేసే ప్రతి కేసును ఆరోగ్యశ్రీలో నమోదు చేయాలని డీసీహెచ్ఎస్ ప్రభావతి అన్నారు. బుధవారం నగరి ఏరియా ఆస్పత్రిని ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఆరోగ్యశ్రీ కేసులు, డెలివరీ కేసులు, ల్యాబ్ రిపోర్టులు పరిశీలించారు. బ్లడ్ బ్యాంకు నిర్వహణను తనిఖీ చేశారు. అనంతరం వైద్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఆస్పత్రికి విచ్చేసే ప్రతి కేసు ఆరోగ్యశ్రీలో నమోదు చేయాలన్నారు. రెఫరెన్స్‌లను తగ్గించి ఆస్పత్రిలోనే వైద్యసేవలు అందించాలన్నారు. వైద్యులకు పలు సూచనలు ఇచ్చారు. మెడికల్ సూపరింటెండెంట్ జరీనా, ఆర్ఎంవో ఆర్.వి.మంజుల, వైద్యులు కార్తికేయన్, ప్రవీణ, ఉష, లోకేష్, జయంత్, మౌనిక, జ్యోష్న పాల్గొన్నారు.

## స్మార్ట్ లాక్ సిస్టమ్‌తో పటిష్ట భద్రత - సీఐ మహేశ్వర్



**నగరి, డిసెంబరు 4 ప్రభాతవార్త:** స్మార్ట్ లాక్ సిస్టమ్‌తో పటిష్ట భద్రత ఉంటుందని సీఐ మహేశ్వర్ అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు, ఈవోపీఆర్డీ, కార్యాలయ సిబ్బందికి స్మార్ట్ లాక్ సిస్టమ్‌పై అవగాహన ఏర్పరచారు. సాంకేతిక పరిజ్ఞానం గల ఈ లాక్‌లను వాడడం ద్వారా ఇళ్ళకు పటిష్టమైన భద్రత ఏర్పడడంతో పాటు ఇతరులు ఆ లాక్‌ను తెరవడానికి ప్రయత్నించినా, దాన్ని పగులగొట్టే ప్రయత్నంచేసినా అల్లారం మోగుతుందన్నారు. అలాగే పోలీసు శాఖ సూచించిన అత్యాధునిక కెమెరాలను ఇంటి వద్ద, దుకాణాల వద్ద ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఊరికి దూరంగా వైఫై సదుపాయం లేని ఇళ్ళకు సోలార్ 4జీ సిమ్, 4ఎంపీ పాన్, టిల్ట్ జూమ్ సదుపాయం ఉన్న సీసీ టీవీ కెమెరాలు వాడితే అది సిమ్ సపోర్టుతో పని చేస్తుందన్నారు. వాటర్ ప్రూఫ్ సౌకర్యం ఉంటుందని రికార్డింగ్ చేసే అంశాలు స్పష్టం ఉంటాయన్నారు. ఈ పరిజ్ఞానంతో కార్లలోను, బైక్‌లలోను కూడా కెమెరాలు వినియోగించుకోవచ్చు. కెమెరాల ఏర్పాటు కోసం కొంత ఖర్చు చేసినా దాని ప్రయోజనం ఎంతోఉంటుందని నివాస్తులు, దుకాణ దారులకుగ్రామాల్లో తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సతీష్, ఈవోపీఆర్డీ పాల్గొన్నారు.

## ప్రొఫెసర్ చెంగయ్యపై దాడి చేసిన రౌడీలను అరెస్టు చేయాలి.



**తిరుపతి విద్య డిసెంబర్ 4,ప్రభాతవార్త:** ఎస్వీయూ ప్రొఫెసర్ చెంగయ్యపై దాడి చేసిన రౌడీ మూకలను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యాక్షులు గౌతమ్కుమార్,మీడియా కో ఆర్డినేటర్ గోళ్ల శవికుమార్ డిమాండు చేశారు.ప్రొఫెసర్పై దాడికి నిరసనగా బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక అంబేద్కర్ భవన్ నుంచి పూలే విగ్రహం వరకు ర్యాలీగా చేపట్టి పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం వారు మాట్లాడుతూ ప్రొఫెసర్ చంగయ్య తప్పు చేసి ఉంటే చట్టపరమైన చర్యలు తీసుకోవాలి తప్ప బజరంగ్ దళ్,విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలం అని చెప్పుకుంటూ ప్రొఫెసర్ ఛాంబర్ లోకి వెళ్లి దాడిచేయడం నీచమైన చర్య అని విమర్శించారు.దాడి చేసి,దౌర్జన్యానికి పాల్పడిన వ్యక్తులను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండు చేశారు.వర్సిటీ అధికారులు,పోలీసులు స్పందించకపోతే బీఎస్పీ ఆధ్వర్యంలో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర జోనల్ కో ఆర్డినేటర్ పి గురుప్ర,రాష్ట్ర కార్యదర్శులు ప్రభాకర్,వేణుగోపాల్ చిత్తూరు జిల్లా అధ్యక్షులు సురేంద్రబాబు,కమిటీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## సంగీత నీరాజనంలో పాల్గొన్న సభ్యులకు ప్రశంస



**తిరుపతి విద్య డిసెంబర్ 4,ప్రభాతవార్త:** పద్మావతి మహిళా వర్సిటీ వేదికగా గత ఆదివారం జరిగిన క్రిష్ణవేణి సంగీత నీరాజనం కార్యక్రమంలో పాల్గొని శాస్త్రీయ సంగీతాన్ని,రాష్ట్ర వారసత్వాన్ని జాతీయ వేదిక పై ప్రదర్శించిన జాతీయ సంస్కృత వర్సిటీ యువ టూరిజం క్లబ్ సభ్యులకు భారత పర్యాటక అభివృద్ధి సంస్థ ప్రశంసాపత్రాలను అందించింది.ధ్రువపత్రాలను మంగళవారం వర్సిటీ వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి నీరాజనంలో పాల్గొన్న బృందాన్ని ప్రత్యేకంగా అభినందించి అందజేశారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సూర్యనారాయణ,డాక్టర్ రాజేష్,రాహుల్ పాల్గొన్నారు.

## పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన వీసీ



**తిరుపతి విద్య డిసెంబర్ 04 ,ప్రభాతవార్త:** ఎస్వీయూ పరిధిలోని బుధవారం నుంచి ప్రారంభమైన మూడవ,ఐదవ సెమిస్టర్ పరీక్షలు నిర్వహణను వీసీ సీహెచ్‌అప్పారావు వివిధ కళాశాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.ఈ పరీక్షలను వర్సిటీ పరీక్షల డీన్ కిషోర్,కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామ్స్ ధామ్లా నాయక్ పర్యవేక్షిస్తున్నారు.ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 62 పరీక్ష కేంద్రాలలో 12 వేల మంది విద్యార్థినీ విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు.ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ గతంలో 25 వేల మంది విద్యార్థులు డిగ్రీ పరీక్షలకు హాజరయ్యేవారని,ప్రస్తుతం ఆసంఖ్య 12 వేలకు చేరుకుందని తెలిపారు.దీంతో 80 కి పైగా సెంటర్లలో పరీక్షలు సంఖ్యా బలం తగ్గడంతో 62 సెంటర్లకు పరిమితం చేశామని తెలియజేశారు.

## ముంపు పంటల రక్షణపై రైతులకు అవగాహన

**వడమాలపేట, డిసెంబరు 4 ప్రభాతవార్త:** తుఫాను ప్రభావంతో నీటి ముంపుకు గురైన పంటలను రక్షించుకోవడానికి రైతులకు రాస్ కృషి విజ్ఞాన కేంద్రం, ఉద్యాన శాస్త్రవేత్త పి.ఎస్.సుధాకర్ అవగాహన కల్పించారు. బుధవారం వడమాలపేట మండలంలోని చింతకాల్వ గ్రామంలో వ్యవసాయశాఖ నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న ఆయన నీటమునిగిన పంటలను పరిశీలించారు. మిరప రైతులకు పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ ఫెంగల్ తుఫాను ప్రభావం వలన అధిక వర్షపు నీటి ముంపుకు గురైన మిరప తోటల్లో నీరు నిల్వ ఉండకుండా మురుగు సౌకర్యం కల్పించాలని సూచించారు. మొదలు కుళ్లు, వేరు కుళ్లు, తెగులు, ఎండు తెగులు రాకుండా మొక్కల మొదల్లను రిడోమిల్ 2 గ్రాముల చొప్పున లీటరు నీటిని కలిపిన ద్రావణంతో బాగా తడిచేటట్టు పిచికారి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి విజయకుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలకు వేరుశనగ పంట విత్తడం వాయిదా వేయాలని కోరారు. గ్రామ వ్యవసాయ సహాయకులు మోహన్ శ్రీవాణి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులను వేధించడం తగదు - యూటీఎఫ్

**విజయపురం, డిసెంబరు 4 ప్రభాతవార్త:** ఉపాధ్యాయులను వేధించడం తగదని యూటీఎఫ్ నాయకులు బుధవారం విజయపురంలో ఎంఈవో శ్యామలకు వినతిపత్రం సమర్పించారు. అసంబద్ధంగా నిర్ణయాలు తీసుకుని పని వేళలు పెంచడం, 10 శాతానికి మించి సెలవు పెట్టరాదంటూ ఆంక్షలు విధించడం, పదో తరగతిలో సంసిద్ధత పేరుతో ఆదివారం, పండుగ దినాల్లో వంద రోజుల యాక్షన్ ప్లాన్ తయారు చేయడం, విద్యార్థుల వివరాలను ఆపార్‌లో నమోదు చేయాలని ఒత్తిడి చేయడం వంటి చర్యలు మానుకోవాలని డిమాండ్ చేశారు. సెలవుపై నిబందన విధించడం వలన కొందరు అధికారులు అనారోగ్యం బారిన పడిన వారికి, అత్యవసరం ఉన్న వారికి సెలవు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతూన్నరని వాపోయారు. విద్యాశాఖ అసంబద్ధ నిర్ణయాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మణిగండన్, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు వంశీకృష్ణ, పలువురు యూటీఎఫ్ సభ్యులు పాల్గొన్నారు.

## కోసలనగరంలో పర్యటించిన ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్



**విజయపురం, డిసెంబరు 4 ప్రభాతవార్త:** మండలంలోని కోసలనగరంలో నగరి ఎమ్మెల్యే బుధవారం పర్యటిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోసలనగరానికి కృషి చేస్తున్నట్టు తెలిపారు. అనంతరం మండల మైనారిటీసెల్ అధ్యక్షుడు ఖాదర్‌బాషా మనవరాలు కేశఖండన కార్యక్రమంలో పాల్గొన్నారు. చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి చినబాబు, టీడీపీ చిత్తూరు పార్లమెంట్ కార్య నిర్వాహక కార్యదర్శి బాలసుబ్రహ్మం రాజు, ప్రధాన కార్యదర్శి బాబుయాదవ్, మాజీ జడ్పీటీసీ వసంతా సుధాకర్ రాజు, నాయకులు నరసింహులు, హరికృష్ణ, సోమశేఖర్, ఓబుల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

## వింత వ్యాధితో గొర్రె పిల్లలు మృతి



**పుత్తూరురూరల్, డిసెంబరు 4 ప్రభాతవార్త:** పుత్తూరు మండలం జయరాంపురం గ్రామానికి చెందిన శంకరయ్య గొర్రెల మేపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో మంగళవారం గొర్రెలను మేతకు తీసుకెళ్లాడు. ఇంటి వద్ద ఉన్న గొర్రె పిల్లలు సాయంత్రం వచ్చేసరికి 20 వరకు ఒక్కొక్కటిగా మృతి చెందాయి. దీంతో సమాచారం స్థానిక పశు వైద్యాధికారిణి ప్రసూన దృష్టికి తీసుకెళ్లారు. ఆమె విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వ్యాధి నిర్ధారణ చేసేందుకు అధికారులను పంపాలని కోరారు. అయితే అప్పటికే బుధవారం ఉదయం ఆ రైతు మృతి చెందిన గొర్రె పిల్లలను పాతిపెట్టారు.

## తరాలు మారినా

ఘంటసాల ప్రతి హృదయంలో చెరగని ముద్ర -జయంతి వేడుకల్లో అభిమానులు



**తిరుపతి(రవాణ),డిసెంబర్ 4(ప్రభాతవార్త:** భక్తిపాటలు ఆలపించి ప్రతి ఒక్కరి హృదయంలో జీవనదిలా చిరస్థాయిగా ఘంటసాల చెరగనిముద్ర వేసుకున్నారని ఆయన అభిమానులు పేర్కొన్నారు. ఘంటసాల జయంతిని పురస్కరించుకుని భవానీనగర్ కూడలిలోని ఆయన విగ్రహానికి రాయలసీమ రంగస్థలి సంస్థ ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి, బిజెపి నేత నవీన్‌కుమార్‌రెడ్డి, గానపీఠం విజయకుమార్, కొట్టే సుబ్రమణ్యంరెడ్డి, చిత్రపు హనుమంతరావు,చ సురేష్‌స్వామి, మల్లారపురవిప్రసాద్ తదితరులు కలసి అభిషేకాలు, పూజలు చేశారు. ఘంటసాల పాటలకు మరణంలేదని, ప్రతి ఒక్కరి హృదయంలో చిరస్థాయిగా ముద్రవేసుకున్నారన్నారన్నారు. అన్నదమ్ముల మధ్య అనుబంధాన్ని, అక్కచెల్లెళ్ళ మధ్య ఆప్యాయతను, భార్యాభర్తల మధ్య ప్రేమానురాగాలను తన పాటల రూపంలో ఆలపించిన మహానుభావుడన్నారు. ఈ సందర్భంగా ఘంటసాల ప్రియశిష్యుడు సోము ఉమాపతిని ఘనంగా సన్మానించారు.

## విద్యార్థులకు భోజన ప్లేట్లు వితరణ



**రేణిగుంట, డిసెంబరు 4 ప్రభాతవార్త:** రేణిగుంట మండలం గురవరాజుపల్లి ఎస్టీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న ఎస్టీ విద్యార్థులకు ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం భోజన ప్లేట్లను ఉచితంగా పంపిణీ చేశారు. ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్‌సీనియర్ మేనేజర్ సుధాకర్‌రెడ్డి ఆర్థిక సహాయంతో భోజన ప్లేట్లను వితరణ చేసినట్లు ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు జూలియన్ రాజు తెలిపారు. ఎస్టీ విద్యార్థుల సంక్షేమం కోసం ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ నిరంతరం కృషి చేస్తున్నదని రాజు అన్నారు. ఇప్పటి వరకు తమసంస్థ ద్వారా అనేక మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు, పలకలు, తదితర విద్యా సామగ్రితో పాటు పరీక్ష సామగ్రిని ఉచితంగా ఇచ్చామన్నారు.అనేక గిరిజన కాలనీలో బోర్లు వేయించి వారి దాహార్తినఇ తీర్చినట్లు తెలిపారు.ఉపాధ్యాయులు ప్రమీల,శ్రీదేవి,అంగన్‌వాడీకార్యకర్తధరణి,ఆషా శ్రీనివాసులు పాల్గొన్నారు.

## రెవెన్యూ సదస్సులను ప్రజలు వినియోగించుకోవాలి - తహసీల్దార్ సురేష్‌బాబు

**రేణిగుంట, డిసెంబరు 4 ప్రభాతవార్త:** రేణిగుంట మండలంలో వివిధ రెవెన్యూ గ్రామాల్లో డిసెంబరు 6వ తేదీ నుంచి జనవరి 8 వరకు జరిగే రెవెన్యూ సదస్సులను ప్రజలు వినియోగించుకోవాలని రేణిగుంట తహసీల్దార్ సురేష్‌బాబు ఒకప్రకటనలో తెలియజేశారు. మండలంలోని 29 రెవెన్యూ గ్రామాల్లో వివిధ శాఖలను సమన్వయపరచి రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కలెక్టర్ వెంకటేశ్వర్ సూచనలతో సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. రెవెన్యూ గ్రామాల్లో జరిగే సదస్సులో రెవెన్యూశాఖకు సంబంధించిన అనేక సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించనున్నారని పేర్కొన్నారు. భూములకు సంబంధించిన సర్వేలు, అడంగల్ రికార్డుల పరిశీలన, ఆదాయ, కుల ధృవీకరణపత్రాలు మంజూరు, పేరు సవరణలకు ఎలాంటి రుసుము చెల్లించకుండా లబ్ధిదారులకు అర్హతలు ఉంటే అందజేస్తామన్నారు.

## పెరటికోళ్ళ పెంపకంపై శిక్షణ సదస్సు



**రేణిగుంట, డిసెంబరు 4 ప్రభాతవార్త:** పెరటి కోళ్ళ పెంపకంపై రేణిగుంట మండలం చైతన్యపురం రాస్ కృషి విజ్ఞాన కేంద్రంలో బుధవారం రైతులకు శిక్షణ సదస్సు జరిగింది. సదస్సులో రైతులకు పెరటి కోళ్ళ పెంపకంపై కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా శ్రీ వెంకటేశ్వర పశు వైద్య విశ్వ విద్యాలయం, విస్తరణ సంచాలకులు బి.శోభామణి మాట్లాడుతూ గ్రామీణ మహిళలు యువత వాణిజ్య దృక్పథంతో పెరటికోళ్ళ పెంపకం చేపట్టడం ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త హెడ్ శ్రీనివాసులు మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి పశు పోషణ తోడుగా ఉంటేనే వ్యవసాయ రంగం లాభసాటిగా ఉంటుందని, పెరటి కోళ్ళు, పాడి పశువులు, జీవాలకు సంబంధించి ఎటువంటి సమస్యలు ఉన్నా, యాజమాన్య పద్ధతులపై అవగాహన కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు కల్పిస్తారన్నారు. ఈ సందర్భంగా రైతులకు వనరాజా కోడి పిల్లలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీ వెంకటేశ్వర పశు వైద్య విశ్వ విద్యాలయం, విస్తరణ సంచాలకులు శోభామణి, కేవీకే సీనియర్ శాస్త్రవేత్త హెడ్ ఎస్.శ్రీనివాసులు, శాస్త్రవేత్తలుడి.అనూష,రాముకుమార్,కేవీబీ పురం, రేణిగుంట మండలాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

## పేదింటి వివాహానికి కరుణాకర్‌రెడ్డి రూ.25వేలు విరాళం



**తిరుపతిరూరల్,డిసెంబర్04 ప్రభాతవార్త:** తుమ్మలగుంటకు చెందిన టిడిపి సీనియర్ నేత దొడ్ల కరుణాకర్‌రెడ్డి ఉప్పరపల్లికి చెందిన టిడిపి కార్యకర్త ముని భాస్కర్ కుమార్తె వివాహానికి రూ.25వేల రుపాయాలు విరాళంతో పాటు పట్టు వస్త్రాలు సమర్పించి,తన దాతృత్వాన్ని చాటుకున్నారు. తెలుగుదేశం పార్టీ జిల్లా ప్రచార కార్యదర్శి దొడ్ల కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ టిడిపికి గెలుపుకు ముని భాస్కర్ కృషి చేసారని, ఆయన ఇంట్లో జరుగుతున్న వివాహానికి తనవంతు ఆర్థిక సాయం అందించడం ఆనందంగా ఉందన్నారు. టిడిపి గెలుపు కోసం కుటుంబ సభ్యుల్లా పని చేసామని తెలిపారు. టిడిపి నాయకులు కార్యకర్తలకు అండగా ఉంటానని స్పష్టం చేసారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పార్లపల్లిభానుకుమార్‌రెడ్డి, శేఖర్, నవీన్‌రాయల్, అయ్యప్ప, హరి, ఉపమాపతి, ముఖేష్‌రెడ్డిపాల్గొన్నారు.

## హిందువుల ఐక్యతకు సమిష్టిగా పోరాటం చేద్దాం



-బంగ్లాదేశ్ హిందువులకు మద్దతుగా తిరుపతిలో ర్యాలీ

**తిరుపతిరూరల్,డిసెంబర్04 ప్రభాతవార్త:** బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ హిందువులు ఏకమైన ర్యాలీ నిర్వహించారు. బుధవారం ముత్యాలరెడ్డిపల్లి కూడలి నుండి ఆర్డీఓ కార్యాలయం వరకు హిందువుల ఐక్యతను చాటుతూ, బంగ్లాదేశ్‌లో హిందువుల పోరాటపటిమను అభినందిస్తూ ముందుకు సాగారు. అనంతరం ఆర్డీఓను కలిసి వినతిపత్రం అందజేసారు. హిందువులంతా ఏకం కావాల్సిన సమయం ఆసన్నమైందని, పోరాటపటిమతో హిందువుల హక్కులను కాపాడుకోవాలన్నారు. జైశ్రీరామ్ అంటూ నినాదాలు చేసారు. ఈ కార్యక్రమంలో టిటిడి పాలకమండలి సభ్యులు భానుప్రకాష్‌రెడ్డి, సామంచి శ్రీనివాస్, నవీన్‌కుమార్‌రెడ్డి, పురుషోత్తమనాయుడు, డాక్టర్ శ్రీహరి, ఆర్ఎస్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 6నుంచి గ్రామ రెవెన్యూ గ్రామ సదస్సులు : తహశీల్దారు జయరాములు



**నారాయణవనం, డిసెంబర్ 4 ప్రభాతవార్త :** ఈనెల 6వతేది నుంచి 31వతేది వరకు రెవెన్యూ గ్రామసభలు నిర్వహించడం జరుగుతుందని తహశీల్దారు ఎం జయరాములు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 6వతేది శుక్రవారం ఉదయం 9నుంచి4గంటల వరకు పాలమంగళం, 7న తుంబూరు, 10న అరణ్యంకండ్రిగ, 11న కీళగరం, 12న సముదాయం, 13న వెంకటకృష్ణాపాలెం, 17న బొబ్బరాజుపాలెం, 18న భీమునిచెరువు, 19న కశింమిట్ట, 20న దిగువకనకపాలెం, 21న ఇప్పతాంగేల్, 24న కళ్యాణపురం, 26న కొండలచెరువు, 27న తిరువట్యం, 28న ఎరికంబట్టు, 31న తేది నారాయణవనంతో గ్రామ రెవెన్యూ గ్రామ సదస్సులు ముగుస్తుందన్నారు. ఈ గ్రామ సభలో మ్యుటేషన్, ఎల్ఇసి, భూమి తగరారు, ప్రభుత్వ భూముల ఆక్రమణ, సెక్షన్ 22(ఎ) అభ్యంతరాలు స్వీకరించి ఆన్‌లైన్‌లో పొందుపరచడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలందరు వినియోగించుకోవాలన్నారు.

## ప్రత్యేక ప్రతిభావంతులను మరచిన అధికారులు

**కేవీబీ పురం, డిసెంబరు 4 ప్రభాతవార్త:** విభిన్న ప్రత్యేక ప్రతిభావంతుల ప్రపంచ దినోత్సవాన్ని కేవీబీ పురం మండల అధికారులు, నాయకులు విస్మరించారని మండల ప్రజలు అంటున్నారని మండల ప్రజలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో డిసెంబరు 3 తేదీ వస్తే ప్రపంచ ప్రత్యేక ప్రతిభావంతుల దినోత్సవం మండల కేంద్రంలో వైభవంగా నిర్వహించి ప్రత్యేక ప్రతిభావంతులకు బహుమతులు అందజేసి వారిని ప్రోత్సహించేవారు. అయితే గత ఐదు సంవత్సరాలుగా విద్యాశాఖ అధికారులు కాని, వెలుగు సిబ్బంది కాని, ఈ కార్యక్రమాన్ని నిర్వహించకుండా మండలంలోని ప్రత్యేక ప్రతిభావంతులను అవమాన పరుస్తున్నారని ప్రత్యేక ప్రతిభావంతులు మండల ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి మండల కేంద్రంలో ప్రపంచ ప్రత్యేక ప్రతిభావంతుల దినోత్సవం నిర్వహించి వారికి బహుమతులు ప్రదానం చేసే విధంగా చర్యలు చేపట్టాలని విభిన్న ప్రత్యేక ప్రతిభావంతులు మండల ప్రజలు కోరుకుంటున్నారు.

## ఉచిత గ్యాస్ పేరుతో బంగారు వెండి ఆభరణాలు చోరీ

**పాకాల, డిసెంబర్ 4, ప్రభాతవార్త** పాకాల మండలం పాకాల పంచాయతీ రామానాయుడు కాలనీలో బుధవారం ఉదయం సుమారు 11 గంటలకు శంకర నాయుడు(68)ఇంటికి ఒక గుర్తు తెలియని వ్యక్తి వచ్చి శంకర్ నాయుడుతో ఉచిత గ్యాస్ సిలిండర్ నీకు వచ్చిందని అన్నాడు. శంకర్ నాయుడు గ్యాస్ బుక్కు, బీరువాలో ఉన్న డబ్బును తీసుకొని మెయిన్ రోడ్‌కి వెల్లగా, అంతలో గుర్తు తెలియని వ్యక్తి బీరువాలోని నల్లపూసల దండ , రెండు బంగారు గాజులు, ఒక మైనర్ చైను, వెండి చేతి బ్రాస్లెట్ పోయినట్టు బాధితులు తెలిపారు.

## ప్రశాంతంగా ముగిసిన నేషనల్ అచీవ్ మెంట్ పరీక్షలు



**పాకాల, డిసెంబర్ 4, ప్రభాతవార్త** మండలంలో నేషనల్ అచీవ్మెంట్ పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్లు విద్యా శాఖాధికారి బాబ్జి తెలిపారు. మండలంలోని దామల చెరువు ఉన్నత పాఠశాల నందు 9వ తరగతి, ఓబుల శెట్టివారి పల్లి ఉన్నత పాఠశాల నందు 6వ తరగతి మరియు పాకాల ఇంఫాంట్ జీసస్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ నందు 3వ, 9వ తరగతుల వారికి ఈ సర్వే నిర్వహించడం జరుగుతున్నదని తెలిపారు. ఈ పరీక్ష పేపర్ నందు తెలుగు, సైన్స్, సోషయల్,ఇంగ్లీష్ మొత్తం 100 మార్కులు ఉంటాయని అన్నారు. ఈ పరీక్ష ఓ.యమ్ఆర్. విధానంలో ఉందని చెప్పారు. విద్యార్థులు రాసిన ఈ ఓ.యమ్.ఆర్.లను షీల్డ్ కవర్ నందు ప్యాక్ చేసి ఉన్నత అధికారులకు అందచేస్తామని అన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అబ్జెర్వర్స్, ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్స్ పాల్గొన్నారు.

## పర్యావరణ రక్షణ కల్పించండి

**నగరి, డిసెంబరు 4 ప్రభాతవార్త:** మున్సిపల్ పరిధి కీళపట్టు శివారుల్లోని కొండలను తవ్వేస్తున్నారని, తమ జీవనాధారమైన అడవి, కొండ నాశనమవుతోందని పర్యావరణాన్ని రక్షించాలంటూ కొండ ప్రాంతానికి సమీప గ్రామాలకు చెందిన యువకులు ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌ను కలసి విన్నవించారు. బుధవారం తిరుపతికి వెళ్లి ఎమ్మెల్యేనఉ కలసి వారు పర్యావరణాన్ని రక్షించాల్సిన అధికారులు క్వారీలకు అనుమతిచ్చి ప్రజల జీవనాధారమైన కొండలు, అడవులు కోల్పోయేలా చేస్తున్నారన్నారు. గ్రామస్తుల వద్ద ఎలాంటి చర్యలు జరపకుండా క్వారీలకు, క్రషర్లకు అనుమతులు ఇచ్చారన్నారు. ప్రకృతి సిద్ధంగా ప్రజలకు జీవనాధారంగా నిలుస్తున్న కొండలు, అడవులు క్వారీల ద్వారా నాశనమవుతోందన్నారు. కొండలపై బాంబులు పేలుతుంటే పశువులు ఎలా మేతకు వెళ్తాయన్నారు. స్థానికుల కోరిక మేరకు డీఆర్‌డీవో నిర్వహించిన సదస్సులోను గ్రామస్తులు మైనింగ్ రద్దు చేయాలని కోరడం జరిగిందన్నారు. అయినా క్వారీ యాజమాన్యం క్వారీ నడుపుతోందన్నారు. క్వారీలను ఆపి ప్రజలకు రక్షణ కల్పించాలని కోరారు. సంబంధిత అంశాన్ని పరిశీలిస్తానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు.

# అటు శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం... ఇటు ఆధ్యాత్మిక జ్ఞానం



శ్రీహరికోట (తడ), డిసెంబర్ 4 ప్రభాతవార్త : శ్రీహరికోట నుంచి అంతరిక్షం లోకి అలవోకగా ఉపగ్రహాల ను మన రాకెట్ల ద్వారా ప్రయోగిస్తున్న శాస్త్రవేత్తలు ఆధ్యాత్మిక భావాలు మాత్రం కొనసాగిస్తున్నారు. ఇస్రో ఛైర్మన్ ఎస్.సోమనాథ్ ఈ ఆనవాయితీని ప్రతి రాకెట్ ప్రయోగానికి ముందు కొనసాగిస్తున్నారు. బుధవారం పిఎస్ఎల్వి-సి59 రాకెట్ ప్రయోగానికి ముందు కూడా ఆయన శ్రీహరికోట అంతరిక్ష కేంద్రానికి సమీపంలోని సూళ్లూరుపేటలో చారిత్రక ప్రసిద్ధి చెందిన శ్రీచెంగాళమ్మను దర్శించుకున్నారు. అంతకుమందు తెల్లవారుజామునే ఇస్రో శాస్త్రవేత్తలు తిరుమల శ్రీవారి ఆలయానికి వెళ్లి రాకెట్ నమూనా ఉంచి పూజలు చేశారు. సూళ్లూరుపేటలో చెంగాళమ్మ తల్లి ఆశీస్సులతో రాకెట్ ప్రయోగం విజయవంతం కావాలని పూజలు చేసినట్లు ఇస్రో ఛైర్మన్ సోమనాథ్ చెప్పారు. ఆయన ఎంఎస్ఎ గ్రూప్ డైరెక్టర్ గోపీకృష్ణ, కొందరు శాస్త్రవేత్తలతో కలిసి ఆలయానికి వచ్చారు. భారీ వర్షంలో వాహనం దిగిన సోమనాథ్ గొడుగు చేతపట్టుకొని పూజా సామగ్రిని ఇంకోచేత్తో పట్టుకొని ఆలయంలోకి వచ్చి పూజలు చేశారు. ఇక్కడ దేవాదాయశాఖ సహాయ కమిషనర్ బి.ప్రసన్నలక్ష్మి ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది ఇస్రో ఛైర్మన్‌కు స్వాగతం పలికిన అనంతరం వేదపండితులు ఆశీర్వాదం చేశారు. శాస్త్ర సాంకేతిక రంగాలలో ఎంతో ఉత్తమమైన ఫలితాలు సాధిస్తున్నప్పటికీ శాస్త్రవేత్తలు ఆధ్యాత్మిక భావాన్ని కొనసాగించడం పట్ల పలువురు స్వాగతిస్తున్నారు. ఇదిలావుంటే రాకెట్ ప్రయోగం ఒకరోజు వాయిదా పడినప్పటికీ నిర్విఘ్నంగా జరుగుతుందని, విదేశీ ఉపగ్రహాలను నిర్దేశించిన అంతరిక్ష అంతరిక్ష కక్ష్యలో పిఎస్ఎల్వి-సి59 రాకెట్ ప్రవేశపెడుతుందని కూడా ధీమా వ్యక్తం చేస్తున్నారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండండి : ఎస్ఐ



సూళ్లూరుపేట, డిసెంబర్ 4 ప్రభాతవార్త : సైబర్ నేరాలు అధికంగా ఉన్నాయని, వాటి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ వి.బ్రహ్మానాయుడు అన్నారు. బుధవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ కొంతమంది ఫేక్‌కాల్స్ చేసి బెదిరించి డబ్బులు గుంజే యత్నం చేస్తున్నారని తెలిపారు. వీటి బారిన పడి చాలామంది డబ్బులు పోగొట్టుకుంటున్నారని తెలిపారు. వారు చేసిన నంబరుకు తిరిగి కాల్ చేస్తే బ్యాంకు అకౌంట్లు హ్యాక్ చేసి, అకౌంట్ల నుంచి డబ్బులు దోచుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు.అలాగే ఎవరయినా పనిమీద వేరే ప్రాంతాలకు వెళ్లేటప్పుడు తమ ఇళ్లకు లాక్ వేస్తే ఈ విషయాన్ని పోలీసులకు తెలియజేసి వెళ్లాలని సూచించారు.

## ఎన్‌బికెఆర్‌లో నౌకాదళ దినోత్సవం

కోట, డిసెంబర్ 4 ప్రభాతవార్త : కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టిలో బుధవారం నౌకాదళ దినోత్సవాన్ని పీడీ మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భారతదేశ భద్రత ధ్యేయంగా నౌకాదళ సేవలు దూసుకుపోతున్నాయని తెలిపారు. క్లిష్ట పరిస్థితుల్లోనూ జాతి గర్వించేలా రక్షణ కవచంలా భారత నౌకాదళం నిలుస్తుందన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సొంతం చేసుకొని మన దేశం అగ్రరాజ్యాల సరసన నిలిచిందన్నారు. ఉత్తమ ఎన్‌సిసి క్యాడెట్లకు బహుమతులు అందజేశారు. నూతనంగా చేరిన ఎన్‌సిసి క్యాడెట్లకు సీనియర్ క్యాడెట్లు స్వాగతం పలికారు.

**సాగునీటి సంఘాల ఎన్నికలు వాయిదా:**

ఈ నెల 8న నిర్వహించాల్సిన సాగునీటి సంఘాల ఎన్నికలను ప్రభుత్వం వాయిదా వేసిందని నీటి పారుదల శాఖ ఏఇ మునిరత్నం తెలిపారు. బుధవారం ఆయన 'ప్రభాతవార్త'తో మాట్లాడుతూ కోట మండలంలోని 20 సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరగాల్సి ఉండగా, ప్రభుత్వం పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వాయిదా వేసినట్లు చెప్పారు.

## నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే పరీక్ష పరిశీలన



కోట, డిసెంబర్ 4 ప్రభాతవార్త : పాఠశాల విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను, అవగాహన నైపుణ్యాలను అంచనా వేయడానికి కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా బుధవారం నిర్వహించిన నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే పరీక్షకు కోట మండలం చిట్టేడులోని గురుకుల పాఠశాల, కోటలోని బిసి గురుకుల పాఠశాల, శ్రీచైతన్య స్కూలు, ప్రగతి స్కూలు, బాలభారతి స్కూలు కేంద్రాల్లో 150 మంది విద్యార్థులు హాజరైనట్లు ఎంఇఓ మస్తానయ్య తెలిపారు. 3, 6, 9 తరగతుల విద్యార్థులు ఈ పరీక్షలు రాసినట్లు పేర్కొన్నారు.

**మళ్లీ వానజడి:**

కోట, డిసెంబర్ 4 ప్రభాతవార్త : ఫెంగల్ తుపాను ప్రభావంతో నాలుగురోజులుగా కురిసిన వర్షాలకు కోట మండలంలో వరినాట్లు వరి నారుమడులు, మిరప పంటలు దెబ్బతిన్నాయి. ఈ వర్షాల ధాటికి పంట నష్టం సంభవించింది. కేశవరం వద్ద మల్లెపూల తోటలు దెబ్బతిన్నాయి. అల్లంపాడు, వెంకన్నపాలెం, ఊనుగుంటపాలెం, వంజివాక, గూడలి తదితర గ్రామాల్లో వరి నాట్లు నీట మునిగాయి. బుధవారం కూడా ఉదయం, మధ్యాహ్నం సమయంలో భారీ వర్షం కురవడంతో రోడ్లన్నీ జలమయం అయ్యాయి.

## 6 నుంచి రెవెన్యూ సదస్సులు



కోట, డిసెంబర్ 4 ప్రభాతవార్త : ఈ నెల 6వ తేదీ నుంచి జనవరి 8వ తేదీ వరకు మండలంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహశీల్దార్ జయ జయరావు చెప్పారు. బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సదస్సుల విధివిధానాలను విఆర్‌ఓలకు వివరించారు. రెవెన్యూ గ్రామాల్లో ప్రజలకు సంబంధించిన భూ సమస్యల పరిష్కారానికి ఈ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రెవెన్యూ సంబంధిత సమస్యల పరిష్కారం కోసం వచ్చే ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా దిశానిర్దేశం చేశారు. భూములకు సంబంధించిన సమస్యలు పరిష్కరించే దిశగా పకడ్బందీగా, ప్రణాళికాబద్ధంగా ఈ సదస్సులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. రెవెన్యూ బృందం ప్రతి గ్రామాన్ని సందర్శించి ఫ్రీహోల్డ్ మరియు సెక్షన్ 22ఎకి సంబంధించిన భూ ఆక్రమణ సమస్యలతో ప్రభావితమైన వారికి ముందస్తు సమాచారంతో అర్జీలు స్వీకరిస్తామన్నారు. రెవెన్యూ సదస్సులు నిర్వహించే రోజుల్లో వచ్చే అర్జీలకు ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. సర్వే, అడంగళ్, 1బి రికార్డు, కులధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం, ముటేషన్ పేరు సవరణ, తదితర పత్రాలకు ఎలాంటి రుసుము ప్రజల నుంచి వసూలు చేయరన్నారు. ఆ రోజు మినహా మిగిలిన రోజుల్లో వచ్చిన అర్జీలకు నిర్ణీత రుసుములు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. సదస్సులో స్వీకరించే ఫిర్యాదులన్నింటినీ రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్‌టిజిఎస్) రూపొందించిన గ్రీవెన్స్ పోర్టల్‌లో ప్రత్యేక విండోలో ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఈ సదస్సులు ఎప్పుడు జరుగుతాయో ప్రజలకు పంచాయతీల్లో తెలియజేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ అజ్మతుల్లా ఖాన్, సర్వేయర్ గోపీరెడ్డి, విఆర్‌ఓలు పాల్గొన్నారు.

## గుంతలో పడిన షారుఖ్ మృతదేహం లభ్యం



చిట్టమూరు, డిసెంబర్ 4 ప్రభాతవార్త : నాయుడుపేట-మల్లాం రహదారి పరిధిలో రొయ్యల వాగు సమీపంలోని బాలచంద్రారెడ్డి ఎస్టేట్ వద్ద ఇద్దరు వ్యక్తులు మంగళవారం గుంటలో పడి మరణించిన విషయం తెలిసిందే. అయితే ఇందులో మధుసూదన్‌రెడ్డి మృతదేహం లభ్యం కాగా, షారుఖ్ మృతదేహం కోసం బుధవారం సైతం అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు. అయితే బోటు సహాయంతో వలలతో గుంట అంతా కలియ తిరిగిన గజ ఈతగాళ్లు ఉదయం సమయంలో షారుఖ్ మృతదేహాన్ని వెలికి తీశారు. పోస్టుమార్టం నిమిత్తం బాలిరెడ్డిపాలెంలోని ఆసుపత్రికి తరలించి బంధువులకు అప్పగించినట్లు ఎంపిడిఓ మనోహర్‌గౌడ్, ఎస్ఐ చినబలరామయ్య తెలియజేశారు.

## 42 రెవెన్యూ గ్రామాలలో రెవిన్యూ సదస్సులు



వాకాడు, డిసెంబర్ 4 ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఈనెల ఐదు నుండి ఎనిమిదో తేదీ వరకు రెవెన్యూ సదస్సులు జరుగుతాయని వాకాడు మండల తాసిల్దార్ రామయ్య తెలిపారు. బుధవారం వాకాడు తాసిల్దార్ కార్యాలయంలోని రెవెన్యూ సిబ్బందితో తాసిల్దార్ రామయ్య ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. తాసిల్దార్ మాట్లాడుతూ మండలంలోని డిసెంబర్ నెల 5వ తేదీ నుండి ఎనిమిదవ తేదీ వరకు జరిగే రెవిన్యూ సదస్సులో భూ సమస్యలు పరిష్కరించబడతాయని తాసిల్దార్ తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ తాసిల్దార్ సందీప్ కుమార్, రెవిన్యూ ఇన్స్పెక్టర్ అఖిల్ యాదవ్, రెవిన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా మద్యం పట్టివేత... ఒకరు అరెస్ట్



వాకాడు, డిసెంబర్ 4 ప్రభాతవార్త :ఎక్సైజ్ పరిధిలోని కోట వాకాడు చిట్టమూరు మండలాల్లో అక్రముగా మద్యం బెల్టు షాపుల్లో విక్రయాల దాడుల్లో భాగంగా గుడలి గ్రామంలోని సునీత ఇంటి వద్ద తొమ్మిది మద్యం బాటిల్లను పట్టుకొని ఆమెను అరెస్ట్ చేశారు. వాకాడు ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రసాద్ వివరాలు మేరకు దాడుల్లో భాగంగా బుధవారం పక్కా సమాచారంతో కోట మండలం గూడలి గ్రామంలోని సునీత అనే మహిళ నిబంధనలు విరుద్ధంగా అమ్మకాలు నిర్వహిస్తున్నారని సమాచారంతో వెళ్లి ఆమె ఇంటిలో తొమ్మిది మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు సిఐ ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలోఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్స్ రాధాకృష్ణ రాజయ్య,సిబ్బంది పి వెంకటేశ్వర్లు, రమణయ్య, పోలయ్య, తదితరులు ఉన్నారు.

## కోడి పందేల స్థావరాలపై దాడులు

వాకాడు, డిసెంబర్ 4 ప్రభాతవార్త: వాకాడు మండల పరిధిలోని కొండాపురం గ్రామం పొలిమేరలో బుధవారం కోడిపందాల స్థావరాలపై ఎస్సై నాగబాబు ఆధ్వర్యంలో దాడులు జరిపారు. పందెంలో ఆడుతుండగా 6 మంది వ్యక్తుల ను అదుపులోకి తీసుకున్నారు, వారి వద్ద రెండు కోళ్లను, 1850 రూపాయలు నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు ,పందెం పాల్గొన్న వ్యక్తులను అరెస్ట్ చేస్తున్నట్లు ఎస్సై నాగబాబు తెలిపారు. గోవర్ధన్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## సేంద్రియ వ్యవసాయంతోనే మంచి ఆరోగ్యం



వెంకటగిరి, డిసెంబర్ 4 ప్రభాతవార్త : సేంద్రియ వ్యవసాయంతోనే మెరుగైన జీవనశైలి, మంచి ఆరోగ్యం సాధ్యమని ప్రకృతి వ్యవసాయ శిక్షణ అధికారిణి సుహర్లత తెలిపారు. వెంకటగిరి వెలుగు కార్యాలయంలో బుధవారం జరిగిన సేంద్రియ వ్యవసాయం, చిరుధాన్యాల పెంపకం, వ్యవసాయంలో మెలుకువలు పై ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి అవగాహన కల్పించారు. యూరియా, ఫాస్పేట్, గుళికలు ఇతర పురుగుమందులో వినియోగం వల్ల మానవుల, జంతువుల ఆరోగ్యం ప్రభావానికి గురవుతున్నట్లు ఆమె తెలిపారు. ప్రకృతి వ్యవసాయంతో భూమి సారవంతమై, అధిక దిగుబడులు సాధించవచ్చునని ఈ సందర్భంగా ఆమె తెలిపారు.

## రేపు వెంకటగిరిలో జాబ్ మేళా

వెంకటగిరి, డిసెంబర్ 4 ప్రభాతవార్త : వెంకటగిరి పట్టణంలోని కాంపాళెం సమీపంలో ఉన్న ఐటిఐలో ఈ నెల 6వ తేది ఉదయం 9 గంటలకు జాబ్ మేళా నిర్వహిస్తామని ప్రిన్సిపల్ ఉమారాణి తెలిపారు. అమర్ రాజా గ్రూప్స్, గ్రీన్లం లిమిటెడ్, డైకిన్ ఎయిర్ కండీషనింగ్ లిమిటెడ్ సంస్థల ప్రతినిధులు పాల్గొంటారు. పదవ తరగతి, ఇంటర్, ఇటీఐ, ఐటీఐ డిప్లొమా, డిగ్రీ చదివిన విద్యార్థులు అర్హులన్నారు. ఆశక్తి కలిగిన అభ్యర్థులు హాజరవ్వాలని కోరారు.

## రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు

బాలాయపల్లి, డిసెంబర్ 4 ప్రభాతవార్త : జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బాలాయపల్లి మండలంలో ఈ నెల 6వ తేది శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ శ్రీనివాసులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ రైతులు అందరు వారి వద్ద గల హక్కు, ఆధారములతో భూ సమస్యలను పరిష్కరిం చుకొనుటకు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# గూడూరు డివిజన్

## పంటల బీమా పథకాలపై అవగాహన



వెంకటగిరి, డిసెంబర్ 4 ప్రభాతవార్త : వెంకటగిరి మండలం యాతలూరు, వల్లివేడు గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం మండల వ్యవసాయ అధికారిణి పి.సుజాత నిర్వహించారు. ఈ సందర్భంగా ఏ.ఓ. మాట్లాడుతూ పంటల బీమా పథకాలపై అవగాహన కల్పించటంలో భాగంగా 2024-25 సంవత్సరంకు సంబంధించి రైతులు స్వచ్ఛందంగా పంటల బీమా కొరకు నమోదు చేసుకోవాలని కోరారు. వరి, వేరుశనగ పంటలకు రైతులు కట్టవలసిన ప్రీమియం వివరాలు, చివరి తేది వరి పంటకు, ఎకరానికి రైతు కట్టవలసిన ప్రీమియం నగదు రూ.630 చివరి తేది ఈ నెలాఖరులోగా, వేరుశనగ పంటకు ప్రీమియం రూ.450, ఈ నెల 15 లోగా చెల్లించాలని తెలిపారు. పశు వైద్య అధికారి డాక్టర్ కిషోర్ కుమార్ గొర్రెలు, మేకలు, పశువులలో వచ్చు వ్యాధులు వాటి నివారణకు వేసుకోవలసిన టీకాలు గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ.ఈ.ఓ. రామ మోహన్, వ్యవసాయ సహాయకులు రాజ్యలక్ష్మి, చెంచు భాస్కర్, ఏ.హెచ్.ఏ.వేణు, రైతులు పాల్గొన్నారు.

## అభివృద్ధికి వైకల్యం అడ్డు కాదు : ఎంపిడిఓ



చిల్లకూరు, డిసెంబర్ 4, ప్రభాతవార్త అభివృద్ధికి వైకల్యం అడ్డు కాదు అని చిల్లకూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారి గోపి అన్నారు.స్థానిక చిల్లకూరులోని భవిత కేంద్రం నందు అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం అత్యంత ఘనంగా జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చిల్లకూరు ఎంపీడీవో గోపి హాజరయ్యారు.గౌరవఅతిథిగా రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు బాబు హాజరయ్యారు. మండల విద్యాశాఖ అధికారులు సనత్ కుమార్ మరియు రావూఫ్, స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యా యులు శారద, భవిత టీచర్లు డా బొమ్మి నాగరాజు, లలిత పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన పిల్లలు వారి తల్లిదండ్రులు సంతోషాన్ని వ్యక్తపరిచారు.

## డిపోలో అక్రమ సస్పెండ్లను రద్దు చేయాలి

**-స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఈ.శివకుమార్**



గూడూరు, డిసెంబర్ 4 ప్రభాతవార్త : ఏపిఎస్ఆర్టిసీ తిరుపతి జిల్లా గూడూరు డిపో మేనేజరు స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ సభ్యుల పట్ల అవలంభిస్తున్న నిర్లక్ష్య పక్ష పాతవైఖరిని మానుకోవాలని అక్రమ సస్పెండ్లను రద్దు చేయాలని, స్టాఫ్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ని.శివకుమార్ హెచ్చరించారు. బుధవారం స్థానిక సి.ఐ.టి.యు కార్యాలయంలో జరిగిన పత్రికా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గూడూరు డిపోలో పనిచేస్తున్న డ్రైవర్లు, కండక్టర్లు విధులు నిర్వహించే క్రమంలో జరిగే ప్రమాదములు, కండక్టర్ల కేసులు పరిష్కరించి న్యాయం చేయుటలో డిపో మేనేజరు యూనియన్ల వారిగా నిర్లక్ష్య పక్షపాతవైఖరి అవలంబిస్తున్నాన్నారు. ఈ కార్యక్రమంలో రీజనల్ అధ్యక్షులు డి.మల్లికార్జున, డిపో అధ్యక్ష,కార్యదర్శులు సి.హెచ్.రాము, జి.శ్రీధర్, రీజనల్ నాయకులు కె. శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## రక్తదానం సామాజిక బాధ్యత



గూడూరు, డిసెంబర్ 4 ప్రభాతవార్త : ఎస్.కే.ఆర్.ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ స్వచ్ఛంద సేవకుల దినోత్సవం సందర్భంగా ఎన్ ఎస్ ఎన్ మరియు రెడ్ రిబ్బన్ క్లబ్ సమన్వయంతో విద్యార్థులు స్వచ్ఛందంగా ముందుకు రావడంతో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే.శివప్రసాద్ బ్లడ్ డొనేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల మనము ఆరోగ్యంగా ఉండటమే కాకుండా రక్తం అవసరమైన వారికి సంజీవని లాంటిదని రక్తదానం చేసిన విద్యార్థులను వారితో పాటు రక్తదానం చేసిన అధ్యాపకులు కోటేశ్వరరావు, విజయ మహేష్, వీరకుమార్‌లను అభినందించారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కే. శివప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వై. శ్రీనివాసులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పి. విజయ మహేష్, రెడ్ రిబ్బన్ క్లబ్ కోఆర్డినేటర్ డాక్టర్ బి. పీర కుమార్, అధ్యాపకులు కిరణమై డాక్టర్ ఝాన్సీ, వాణి, లక్ష్మి హిమబిందు, రవిరాజు, వెంకటేశ్వర్లు, రమేష్, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పరిశ్రమలలో మౌలిక వసతులు కల్పించాలి

**-మంత్రులకు మాజీ ఎంపి వరప్రసాద్ విన్నపం**



గూడూరు, డిసెంబర్ 4 ప్రభాతవార్త : తిరుపతి లోక్‌సభ పార్లమెంట్ పరిధిలో శ్రీ సిటీ, మేనకూరు, మాంబట్టు సెజ్‌ల నందు మౌలిక వసతులు కల్పించాలని మాజీ ఎంపి వరప్రసాద్ రావు మంత్రులకు విన్నవించారు. ఆయన మంత్రులకు వివరిస్తూ పరిశ్రమలలో పనిచేస్తున్న ఉద్యోగులకు విశ్రాంతి తీసుకునేందుకు రెస్ట్ రూములు (విశ్రాంతి భవనములు) పురుషులకు, మహిళలకు వేరు వేరు మరుగుదొడ్లు నిర్మించాలని, ప్రతి ఒక్క ఉద్యోగికి పిఎఫ్ వచ్చే విధంగా చేయాలన్నారు. ఈఎస్ఐ హాస్పిటలను మంజూరు చేయాలని మాజీ ఐఎఎస్ ఆఫీసర్, మాజీ ఎంపి, మాజీ ఎమ్మెల్యేవెలగపల్లి వరప్రసాద్ రావు బుధవారం ఢిల్లీలో శ్రమశక్తి భవన్లో కేంద్ర సహాయ మంత్రి శోభ కరంద్లాజేని కలిసి సమస్యలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గూడూరు పట్టణ బిజెపి యువ నాయకుడు దుగ్గన వినేష్ యాదవ్ పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్యలపై అధికారులతో సమీక్షించిన ఎమ్మెల్యే



గూడూరు, డిసెంబర్ 4 ప్రభాతవార్త : గూడూరు డివిజన్ పరిధిలోని విద్యుత్ సిబ్బందితో క్యాంప్ కార్యాలయం నందు ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్ కుమార్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ గ్రామాలలో విద్యుత్ లైన్లు ఇళ్లపైన వెళుతున్నాయని, అలాగే కొన్ని గ్రామాలలో లైన్లు ఇబ్బంది కరంగా ఉన్నాయని వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని తెలిపారు. నియోజకవర్గంలో రైతులు ఇపుడిపుడే వరి నాట్లు వేస్తున్నారని, కొన్ని రైతులు ట్రాన్స్‌ఫర్మర్ లేక ఇబ్బందిలు పడుతున్నారు. రైతులు ఇబ్బంది పడకుండా వారికి ట్రాన్స్‌ఫర్మర్‌లు అందించాలని తెలిపారు. కావాలసిన ప్రపోసల్స్ నా దృష్టికి తీసుకువస్తే మంత్రి దృష్టికి తీసుకెళ్లి మంజూరు చేయించుకుని వస్తానని తెలిపారు. రైతుల సాగుకు విద్యుత్ అంతరాయం లేకుండా అందించేలా చూడాలని తెలిపారు.

## మైనింగ్ అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి

**-కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పంట శ్రీనివాసులు రెడ్డి**



గూడూరు, డిసెంబర్ 4 ప్రభాతవార్త : గత వైసిపి ప్రభుత్వంలో సైదాపురం మండలంలో అక్రమ మైనింగ్ ద్వారా వేల కోట్ల రూపాయల దోచుకున్న వారికి నేడు టిడిపి ప్రభుత్వం మైనింగ్ అనుమతులు ఇచ్చేందుకు ప్రయత్నాలు చేస్తుందని మైనింగ్ అక్రమాలకు పాల్పడిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పంట శ్రీనివాసులురెడ్డి డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ సర్వేపల్లి ఇంచార్జ్ పూల చంద్రశేఖర్, రావూరి బ్రహ్మయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

## అధ్యాపకునిపై దాడి అమానుషం

**-నిందితులను తక్షణం అరెస్ట్ చేయాలి**

**-మీడియా సమావేశంలో నగర పాస్టర్స్ అసోసియేషన్ సభ్యులు**

**తిరుపతి విద్య, డిసెంబర్ 4 ప్రభాతవార్త:**



ఎస్వీయూ దళిత అధ్యాపకుడు చెంగయ్యపై దుండగులు దాడి చేయడం అమానుషమని నగర పాస్టర్స్ అసోసియేషన్ సభ్యులు పాస్టర్ అరుల్ అరుసు ఆగ్రహం వ్యక్తం చేశారు.బుధవారం స్థానికి బాలాజీ కాలని అంబేద్కర్ భవన్లో తిరుపతి పాస్టర్స్ ఫెలోషిప్,ఇతర పాస్టర్స్ అసోసియేషన్ నాయకులు మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ ఎస్వీ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజ్ ప్రొఫెసర్ చంగయ్యపై క్రైస్తవ మత ప్రచారం చేసారని భజరంగ్ దళ్,ఎబీవీపీ దుండగులు సభ్యసమాజం తలదించుకునే విధంగా దాడి చేయడం హేయమైన చర్యగా పేర్కొన్నారు. ఈ అమానుష దాడికి పాల్పడిన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీఎస్పీ పార్టీ నేత,రిటైర్డ్ జడ్జి గుర్రప్ప,పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు అరుల్ అరుసు,ముస్లిం నాయకులు రఫీ,దళిత అకాడమీ నాయకులు ధనశేఖర్,పాల్ రాజ్,బిషప్ రాజ్కుమార్,మార్టిన్,ప్రభాకర్,అడ్వకేట్ రమేష్ వెంకట్ పాల్గొన్నారు.

## నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు : ఎమ్మెల్యే



బుచ్చినాయుడు కండ్రిగ, డిసెంబరు 4 ప్రభాతవార్త: ఏకలవ్య గురుకుల పాఠశాల విద్యార్థుల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని ఎమ్మెల్యే ఆదిమూలం ప్రిన్సిపాల్‌కు, ఉపాధ్యాయులను హెచ్చరించారు. బుధవారం మండలంలోని ఏకలవ్య గురుకుల పాఠశాల విద్యార్థుల సమస్యలపై ఆకస్మికంగా పరిశీలించారు. ఏకలవ్య గురుకుల పాఠశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై తహసీల్దార్, ఎంపీడీవో, విద్యాశాఖ, వైద్య అధికారుల సమక్షంలో విద్యార్థులతో కూర్చుని సమస్యలపై చర్చించి ఉపాధ్యాయులు విద్యార్థుల మధ్య జరుగుతున్న సమస్యలపై ఆరా తీశారు. ఇక నుంచిపాఠశాలలో విద్యార్థుల పట్ల ఎటువంటి సమస్యలు తలెత్తిన సహించేది లేదని ఆయన సిబ్బందిని హెచ్చరించారు. వీరి వెంట తహసీల్దార్, ఎంపీడీవో, విద్యాశాఖ అధికారులు, ఆరోగ్యశాఖ అధికారులు, నాయకులు చెరుకూరి మునిచంద్రనాయుడు, దయానాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## తిరుమలలో గత అవినీతి అక్రమాలపై... విచారణ చేయాలి






తిరుపతి(రవాణ),డిసెంబర్ 4ప్రభాతవార్త: గత ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వంలోని గత టిటిడి పాలకమండళ్ళ ఛైర్మన్లు, సభ్యులు, కొందరు అధికారులు పాల్పడిన అక్రమాలు అవినీతిపై విచారణ చేయాలని, జరిగిన అనేక రకాల అవినీతిపై నిగ్గుతేల్చాలని కాంగ్రెస్ పార్టీ నేతలు డిమాండ్ చేశారు. కొండపై 2019వరకు సామాన్యభక్తులకు అందుబాటులో ఉన్న తాగునీటి సీసాలు కూడా వైసిపి పెద్దల కమీషన్ల కోసం రద్దుచేసి, గాజుసీసా మంచినీటి సీసాలు తీసుకురావడం, నిధులు పక్కదారిమళ్ళించి దుర్వినియోగం చేశారని నాయకులు ఆరోపించారు. గత ఐదేళ్ళ అక్రమాలు,అవినీతిపై విచారణ చేసి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఉదయం టిటిడి పరిపాలన భవనం వద్ద కాంగ్రెస్ నాయకులు గర్జనసభ నిర్వహించారు. తిరుపతి నగర కాంగ్రెస్ అధ్యక్షుడు గౌడపేర చిట్టిబాబు నాయకత్వంలో చేపట్టిన ఈ నిరసన సభకు పిసిసి ఉపాధ్యక్షుడు దొడ్డారెడ్డి రాంభూపాల్‌రెడ్డి, నెల్లూరుజిల్లా కాంగ్రెస్ ఇన్‌ఛార్జి మాంగాటి గోపాల్‌రెడ్డి, పిసిసి ప్రధాన కార్యదర్శి వెంకటనరసింహులు, కాంగ్రెస్ పార్టీ కేడర్ నేతలు చిత్తూరు శివశంకర్, మురళీకృష్ణ, సుప్రజ, నరేంద్రబాబు, మల్లికార్జున, తలారి గోపి, మోహన్, లక్ష్మిలు కార్యకర్తలతో పెద్దసంఖ్యలో నిరసన చేపట్టారు. తిరుమల కొండపై గత ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వం, పెద్దలు అనేక అక్రమాలు చేశారని, ఆర్థిక అక్రమాలు, హాకర్‌లైసెన్స్‌లు, కాంట్రాక్టర్ల అక్రమాలు, మంచినీళ్ళసీసాల కుంభకోణంపై టిటిడి శ్వేతపత్రంవిడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఏకంగా దుకాణాలను మార్చుకునేందుకు కోట్లరూపాయల్లో లావాదేవీలు జరిగాయని, హాకర్ల వ్యాపారాలు చేసుకునేందుకు కొందరు వైసిపి నేతలు లక్షల్లో దండుకుని తమవారికి ఇచ్చారని ఆరోపించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రంను టిటిడి ఈఓ శ్యామలరావుకు కాంగ్రెస్ నాయకులు సమర్పించారు.

## వివాహిత ఆత్మహత్యాయత్నం!

పుంగనూరు,నవంబరు 4 ప్రభాతవార్త : మండలంలోని పట్రపల్లి గ్రామానికి చెందిన రాధమ్మ అనే వివాహిత సోమవారం పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడింది. గ్రామానికి చెందిన రాజప్ప భార్య అయిన రాధ కుటుంబ ఘర్షణల కారణంగా క్రిమిసంహారక మందు తాగిందని, కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ఆమెను చికిత్సనిమిత్తం తరలించి,కేసు నమోదు చేశారు.

## శివయ్య హుండీ ఆదాయం రూ.1.90కోట్లు



శ్రీకాళహస్తి, డిసెంబర్ 4 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం స్వామి అమ్మవార్ల హుండీలతో పాటు పరివార'దేవతల హుండీల లెక్కింపును కార్యనిర్వహ ణాధికారి బాపిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిం చారు. శ్రీకాళహస్తీశ్వరుని ఆదాయ ం రూ.1,90,35,265కోట్లు వచ్చినట్లు ఇఓ తెలిపారు. ఇందులో బంగారు 106గ్రాములు కాగా, వెండి 466కిలోలు వచ్చినట్లు వివరించారు.విదేశీ నోట్లు 121వచ్చినట్లు వివరించారు. హుండీ లెక్కింపులో ఇఓ బాపిరెడ్డితోపాటు డిప్యూటీ ఈవో ఎన్ఆర్‌కృష్ణారెడ్డి పలువురు ఆలయాధికారులు పాల్గొన్నారు.

## చంద్రగిరి గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మె సైరన్

**కనీస వేతన రూ.18000 లు అమలుకు డిమాండ్**

చంద్రగిరి, డిశంబర్ 4 ప్రభాతవార్త: చంద్రగిరి గ్రామ పంచాయతీలో పారిశుధ్య కార్మికులు సమ్మె సైరన్ మ్రోగించారు. ఏళ్ళ తరబడి చాలీచాలని వేతనాలతో బ్రతుకులీడుస్తూ కనీస వేతనం కోసం ఎదురు చూస్తున్న కార్మికులు కన్నెర్ర చేశారు. ఈ మేరకు బుధవారం పంచాయతీ ఈఓ మహేశ్వరయ్యకు వినతి పత్రం (సమ్మె నోటీసు) అందజేశారు. గ్రామ పంచాయతీలో పరిశుభ్రత, ప్రజా రోగ్యం, పర్యావరణ పరిరక్షణకు ప్రాణాలు పణంగా పెట్టి వెట్టిచాకిరీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రాణాంతక మహమ్మారి కరోనా కష్టకాలంలో కరోనాతో యుద్ధం చేస్తూనే ప్రభుత్వం తరపున ప్రజలకు సేవలందించామన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగానిత్యవసర వస్తువులు, పెట్రోలు, డీజిల్, గ్యాస్, విద్యుత్, బస్సు చార్జీలు, విద్య, వైద్య, ఖర్చులు, ఇంటి అద్దెలు పెరుగుతున్నప్పటికీ తమ వేతనాలు మాత్రం పెరగలేదన్నారు. తమకు కనీస వేతనం రూ.18000/-లు పెంచాలని కోరారు. ఈ నెల 15 లోపు సానుకూల నిర్ణయం తీసుకోని పక్షంలో 16 నుండి తాము నిరవధిక సమ్మెకు వెళతామని తేల్చిచెప్పారు.

## అసంబద్ధంగానే విద్యాశాఖ నిర్ణయాలు

నగరి, డిసెంబరు 4 ప్రభాతవార్త: ఉపాధ్యాయులకు అసంబద్ధంగానే విద్యాశాఖ నిర్ణయాలు ఉన్నాయని వాటిని రద్దు చేయాలని యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు బుధవారం ఎంఈవో నమఃశివాయం కు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ పాఠశాలల పనివేళల పెంపు, 10శాతం మించి ఉపాధ్యాయులు సెలవులు పెట్టరాదనే ఆంక్షలు, 10వ తరగతి పరీక్షలకు సంసిద్ధత పేరుతో విడుదల చేసిన 100 రోజుల యాక్షన్ ప్లాన్, విద్యార్థులు వివరాలు అపార్‌లో నమోదు. ఇలా ప్రతి ఒక్క నిర్ణయం అసంబద్ధంగానే ఉన్నాయన్నారు. ముఖ్యంగా మండలాల్లో 10 శాతం మంది ఉపాధ్యాయులు సెలవులు పెట్టరాదని మండల విద్యాశాఖాధి కారులు అత్యవసర సందర్భాల్లో కూడా సెలవులు మంజూరు చేయడం లేదన్నారు. విద్యాశాఖ అసంబద్ధ నిర్ణయాలు ఉపాధ్యాయులను తీవ్ర ఆందోళన మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నాయని ఈ నిర్ణయాలను రద్దు చేయాలన్నారు.